ఈనాడు
విశాఖపట్నం
సోమవారం 14 అక్టోబరు 2024
సిటీ 5

సండే సండడి



ఆర్కే బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు, నగరవాసులు

రైతుబజార్లకు కుళ్లిన టమాటా సరఫరా

కంచరపాలెం, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో టమాటా రేట్లు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కిలో రూ. 80లకు అమ్ముతున్నారు. దీంతో అత్యధిక శాతం మంది కొనుగోలుదారులు రైతుబజార్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ కిలో రూ. 48కి విక్రయిస్తుండటంతో వినియోగదారులు పోటెత్తుతున్నారు. ఇదే అదనుగా రైతుబజార్లకు కుళ్లిన టమాటాను సరఫరా చేస్తున్నారు. ఆదివారం కంచరపాలెం రైతుబజారుకు భారీగా కొనుగోలుదారులు వచ్చారు. గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారుకు ఆదివారం 2600 కిలోలు టమాటా వచ్చింది. ఇందులో 152 కిలోలు కుళ్లిపోయాయి. 1400 కిలోలు అమ్మగా 1200 కిలోలు ఇంకా మిగిలి ఉన్నాయని, కుళ్లిన టమాటాను విక్రయించకుండా పక్కన పెట్టినట్లు రైతుబజారు ఎస్టేటు అధికారి కృష్ణమూర్తి తెలిపారు. వరుస సెలవులు కావడంతో శానిటరీ సిబ్బంది విధులకు రాకపోవడంతో రైతుబజారు పరిసరాలు వ్యర్థాలతో నిండిపోయాయి. చెత్త కుళ్లి తీవ్ర దుర్వాసన వెల్లజల్లుతోంది. చెత్తకుప్పల పక్కనే క్యూలైన్లలో నిల్చుని టమాటా కోసం వేచిచూడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.


కంచరపాలెం రైతుబజారులో టమాటా కోసం బారులు తీరిన వినియోగదారులు


కుళ్లిన టమాటా

బృహత్తర ప్రణాళికకు మార్పు!

ఈనాడు, విశాఖపట్నం

కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో వివాదాస్పదమైన విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) 2041- బృహత్తర ప్రణాళిక ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. వైకాపా నేతలు వారికి ఇష్టానుసారంగా చాలా ప్రతిపాదనలు చేసుకున్నారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో దాని మార్పునకు అన్ని వర్గాల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉండగా దీనిపై ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.


భీమిలి-భోగాపురం ప్రతిపాదిత మార్గం

వైకాపా నేతలకు అనుకూలంగా ప్రతిపాదించిన వాటిపై చర్చ

ఆరోపణల్లో కొన్ని.. ✦ ప్రతిపాదిత భీమిలి-భోగాపురం రహదారిని కీలక వైకాపా నేతలకు అనుకూలంగా వంపులు తిప్పారు. భీమిలి మండలం నేరెళ్లవలస, ఎస్‌వోఎస్, కొత్తవలస ఇలా అనేక చోట్ల వైకాపా నేతలకు ఆస్తులున్న చోట తిప్పారన్న ఆరోపణలున్నాయి.

✦ రాడిసన్‌బ్లూ రిసార్టు వద్ద, బీచ్ రోడ్డులోని కొన్ని చోట్ల ఒక వైపు తగ్గించి మరో వైపు పూర్తిగా పెంచేశారు. కొన్ని చోట్ల ఒక వైపే చాలా ఇళ్లు పోనున్నాయి.

✦ కోరమండల్ ప్రాంతంలో జలవనరులు ఉంటే లేనట్లు చూపించారు. అదే చోట గతంలో అనుమతిచ్చిన లేఅవుట్లు ఉంటే వాటిని పచ్చదనం పెంచే ప్రాంతాలుగా మార్చేశారు. దీంతో ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వారి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరవ్వడం లేదు.

✦ పెందుర్తిలో గతంలో పారిశ్రామిక ప్రాంతంగా ప్రతిపాదించిన దాన్ని ఇప్పుడు నివాస ప్రాంతంగా మార్చేశారు.



మొత్తం వీఎంఆర్‌డీఏ విస్తీర్ణం	6836.15 చ.కి.మీ.
బృహత్తర ప్రణాళిక తయారైన ప్రాంతం	4380.67 చ.కి.మీ.
కొత్తగా చేయాల్సినది	2455.48 చ.కి.మీ.
జిల్లాలు	3
నియోజకవర్గాలు	18
గతంలో వచ్చిన అభ్యంతరాలు	5045

ప్రజాప్రతినిధులతో సమావేశం

2041- బృహత్తర ప్రణాళికలో భీమిలి-భోగాపురం ఆరు వరుసల రహదారి కోసం ప్రతిపాదించిన మార్గం వివాదాస్పదమైంది. కొందరు వైకాపా నేతలు వారి ఆస్తులకు విలువ పెంచుకునేలా మార్పులు చేసుకున్నారు. అలాగే ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరైతే ఏకంగా పాత ప్రణాళికను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు తగ్గట్టు కొత్తగా తయారు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం దీన్ని మార్చాలంటే తిరిగి ప్రభుత్వం అనుమతి ఉండాలి. లేకుంటే అయిదేళ్ల తర్వాత మార్చుకోవచ్చు. వీటన్నింటి మీద చర్చించేందుకు త్వరలో ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించాలని గతంలో భావించినా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కొత్త మండలాలకు..

వీఎంఆర్‌డీఏ పరిధి మొత్తానికి బృహత్తర ప్రణాళిక చేయకపోవడంతో మిగిలిన మండలాల ప్రణాళికకు అధికారులు సిద్ధమవుతున్నారు. అనకాపల్లి జిల్లాలో అటువంటివి 13 మండలాలున్నాయి. వీటికి ప్రణాళికల రూపకల్పనకు ప్రణాళిక విభాగం అధికారులు పురపాలకశాఖకు నివేదిక పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే దానికోసం కసరత్తు మొదలెట్టనున్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

మాధవధార, న్యూస్‌టుడే

పదకొండు రోజుల పాటు సాగిన మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ పరిశీలన ఆదివారంతో ముగిసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మద్యం దుకాణాల లాటరీ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దరఖాస్తుదారులంతా ఉదయం 7 గంటలకు వుడా హెల్త్ ఎరీనా వద్దకు చేరుకోవాలన్నారు. ప్రవేశపత్రం, గుర్తింపు కార్డుతో దరఖాస్తుదారున్ని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. దరఖాస్తుదారుడు రాకపోతే అతని తరపు అధీకృత బాధ్యుడిని అనుమతిస్తారు. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీయడం జరుగుతుందన్నారు. లాటరీ దుకాణం దక్కించుకున్నవారు 16 నుంచి కొత్త దుకాణాల్లో మద్యం విక్రయాలు చేసుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు.



■ ఉమ్మడి విశాఖ జిల్లాలో 8635 దరఖాస్తుల రాక

■ సమకూరిన రూ.172.70 కోట్ల ఆదాయం

లాటరీ తీసే ప్రాంతాలు

విశాఖ జిల్లాకు సంబంధించి సిరిపురంలోని వుడా హెల్త్ ఎరీనాలో, అనకాపల్లి జిల్లాకు పాత బస్‌స్టాండ్ సమీపంలోని విప్పుల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో, అల్లూరి జిల్లాకు పాడేరులోని వి.ఆర్.ఫంక్షన్ హాల్‌లో లాటరీలు తీయనున్నారు.

లెక్క తేలింది..

మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ పరిశీలన ఆదివారంతో ముగియడంతో దరఖాస్తుల లెక్క తేలింది. మొత్తం 331 మద్యం దుకాణాలకు 8635 దరఖాస్తులు రాగా.. రూ.172.70 కోట్లు ఆదాయం సమకూరింది.

జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు

జిల్లా	షాపులు	దరఖాస్తులు
విశాఖ	155	4139
అనకాపల్లి	136	3291
అల్లూరి	40	1205
మొత్తం	331	8635

దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ..

సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేసుకున్నవారు, మద్యం వ్యాపారాలు చేస్తున్న వారు, కొత్తగా మద్యం వ్యాపారం చేయాలని వచ్చినవారు.. ఇలా అందరిలోనూ నేడు జరిగే లాటరీ పట్ల ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొదట్లో కొందరు కూటమి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఇతరులను దరఖాస్తులు వేయనీయకుండా అడ్డుకున్నారు. అయితే సీఎం రంగంలో దిగి అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. ఈసారి ఒడిశా, దిల్లీ, విదేశాల్లో ఉన్నవారు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసినవారు ఉన్నారు. దీంతో ఎవరికి వస్తుందో అనే ఉత్కంఠ అందరిలో నెలకొంది.

దుకాణాల కోసం పైరవీలు.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ దుకాణాలకు అద్దెకిచ్చిన కొందరు వ్యాపారులు చక్రం తిప్పుతున్నారు. నెల రోజులు ముందుగానే ప్రభుత్వ హయాంలో నడుస్తున్న దుకాణాలకు అడ్వాన్స్ ఇచ్చి దుకాణాలను ఎక్కడికక్కడ బ్లాక్ చేశారు. ఇప్పుడు వారికి కాకుండా, వేరొకరు లైసెన్స్‌లు పొందినవారు వస్తే తమకు కూడా కొంత వాటా ఇవ్వాలంటూ వారిని దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అక్రమ వ్యవహారంపై అధికారిక వ్యూహం!

ఈనాడు, విశాఖపట్నం

ఫ్రీహోల్డ్ భూముల్లో తెరవెనుక జరిగిన అక్రమ భూవ్యవహారాలను అధికారికం చేసుకునేందుకు అక్రమార్కులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా విశాఖ వంటి చోట్ల స్థలాల విలువ భారీగా పెరిగింది. దీంతో వీలైనంత త్వరగా వాటిని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఎసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత వాటిని నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తొలగించింది. అలా తప్పించిన వాటిల్లో సగం స్థలాలు నాటి కీలక నేతలు, ఉన్నతాధికారుల బినామీలతో రిజిస్ట్రేషన్లు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'ఫ్రీహోల్డ్ భూముల' రిజిస్ట్రేషన్లు నిలిపేసింది. మూడు నెలల పాటు క్రయ విక్రయాలు జరపకూడదని ఆదేశించింది. దీంతో వందల ఎకరాలు పెద్దల చేతుల్లోకి వెళ్లకుండా నిలిచిపోయాయి. ప్రస్తుతం వారంతా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. త్వరలోనే ఈ గడువు పూర్తవనున్న నేపథ్యంలో లోపాయికారిగా జరిగిన అన్నింటినీ లాగేయాలని చూస్తున్నారు. దీని అమలుకోసం కూటమి నేతల మీద కొందరు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఆ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధం ఎత్తేస్తే సుమారు రూ. 3 వేల కోట్ల భూములు అక్రమార్కుల గుప్పెట్లోకి వెళ్తాయనేది అంచనా.

- ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఎదురుచూపు
- కూటమి నేతలు, అధికారుల మీద ఒత్తిడి
- ఆందోళనలో లోపాయికారి కొనుగోలుదారులు
- మిగిలిన వాటిని రాయించుకునేందుకు విశ్వప్రయత్నం


ఆనందపురంలో ఫ్రీహోల్డ్ జరిగిన స్థలం

■ ఆనందపురం మండలం రామవరం గ్రామంలో ఎకరా రూ.2 కోట్లు పలుకుతుంది. మధ్యవర్తులు అక్కడి రైతులతో మాట్లాడి ఎకరా రూ.18 లక్షలకు కొనుగోలు చేశారు. ఆ రైతులకు సగం డబ్బులు ఇచ్చి విక్రయించాక మిగిలిన డబ్బులు ఇస్తామని రాయించుకున్నారు. ఇంకొందరికి మొత్తం డబ్బులు ఇచ్చేసినా రిజిస్ట్రేషన్ అవ్వకపోవడంతో సగం డబ్బులు మళ్లీ వెనక్కు తీసుకున్నారు. కొందరు రైతులతో పత్రాలు రాయించుకొని డబ్బులు ఇవ్వకుండా తిప్పిస్తున్నారు.

■ ఒప్పందాలు జరగని ఫ్రీహోల్డ్ భూముల మీద తాజాగా కొందరు కన్నేశారు. ప్రభుత్వం అనుమతించాక రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉమ్మడి కుటుంబాలు, కుటుంబ వివాదాల్లో నివి గుర్తించి తక్కువ డబ్బులకు ఒప్పించి పత్రాలు రాయించుకున్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములను డెవలప్‌మెంట్‌కు తీసుకునేందుకు ఒప్పందాలు చేసుకున్నారు.

మిగిలిన భూములపై కన్ను!

జిల్లాలో మొత్తం 626 ఎకరాలు ఫ్రీహోల్డ్ జరిగితే అందులో రిజిస్ట్రేషన్ అయిన భూములు 135 ఎకరాలు. మిగిలిన 491 ఎకరాల్లో సుమారు 200 ఎకరాలకు లోపాయికారి ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు వీటికి రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. గత ప్రభుత్వంలోని కీలక నేతలు కొందరు ముందే కన్నేసి తక్కువ డబ్బులకు భూములు కొనేసి బినామీలతో పత్రాలు రాయించుకున్నారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలిలో ఇటువంటివి అధికంగా జరిగాయి. వాటికి రిజిస్ట్రేషన్లు అవ్వకపోవడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్లు చేయాలని అధికారుల వద్దకు రైతులను పంపించి ఒత్తిడి చేస్తున్నారు.

రూ.వందల కోట్ల అక్రమాలు

ఆనందపురం మండలంలో 407 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా వాటిల్లో మొత్తంగా 200కుపైగా ఎకరాలకు లోపాయికారి ఒప్పందాలు జరిగాయి. వాటి విలువ రూ. 2 వేల కోట్ల వరకు ఉంటుంది. పద్మనాభం మండలంలో 145 ఎకరాలకు జరగ్గా అందులో సగానికిపైగా భూములకు అక్రమ ఒప్పందాలు జరిగాయి. వాటి విలువ రూ. 500 కోట్లు. భీమిలి మండలంలో 52 ఎకరాలు, పెందుర్తి మండలంలో 20 ఎకరాలుంటే వాటిల్లో చాలా వరకు స్థలాలు చేతులు మారేలా ఒప్పందం చేసుకున్నారు.

16 బస్సులపై కేసుల నమోదు

మాధవధార, న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులపై ఆదివారం రవాణాశాఖ ఆధ్వర్యంలో పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. పండగ ముగిసిన సందర్భంగా ఊర్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణం అవుతుండటంతో, హైదరాబాద్, విజయవాడ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా డీటీసీ జి. ఆదినారాయణ తెలిపారు. ఇప్పటి వరకు 50 బస్సులపై కేసులు నమోదు చేసి 9 బస్సులను సీజ్ చేసినట్లుగా తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఇలాగే తనిఖీలు కొనసాగుతాయన్నారు.


ట్రావెల్ బస్సు రికార్డులను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

పసిడి రూపం.. దేదీప్యం


విజయదశమి పర్వదినాన కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో దర్శనమిచ్చారు. పసిడి వర్ణంలో దేదీప్యంగా వెలుగొందిన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా నగరానికి చెందిన సుంకర రామరవీంద్ర, శ్రీరామ వెంకటనరసింహం భిన్న రకాలకు చెందిన పండ్లను అమ్మవారికి సమర్పించారు. -న్యూస్‌టుడే, వన్‌టౌన్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ జోనల్, ప్రధాన కార్యాలయాల్లో అధికారులు వినతులు స్వీకరిస్తారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, అనధికారిక నిర్మాణాలు, టిడ్కో గృహాల కేటాయింపు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు.

తుపాను సూచన నేపథ్యంలో అప్రమత్తత అవసరం

✦ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అనిత ✦ బీచ్‌రోడ్డులో భద్రతపై ఆకస్మిక పరిశీలన

ఈనాడు, విశాఖపట్నం : రాష్ట్రానికి భారీ వర్ష సూచన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వంగలపూడి అనిత విశాఖ నుంచి మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారానికి వాయుగుండంగా బలపడనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆమె హోం, విపత్తుల నిర్వహణ శాఖలను అప్రమత్తం చేశారు. రాబోయే తుపాను నుంచి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ఇబ్బంది, ఆస్తి నష్టం కలగకుండా కీలక శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్స్యకారులు, రైతులు, గొర్రెల పెంపకందారులు రాబోయే రెండు రోజులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ శాఖ ద్వారా సందేశాలు, ఫోన్‌లు చేసి అప్రమత్తం చేయాలని సూచించారు. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలున్నాయన్న హెచ్చరికలతో ఆయా కలెక్టర్లు జిల్లాల యంత్రాంగాన్ని సంసిద్ధంగా ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. అనంతరం విశాఖ బీచ్‌లో ప్రజల రక్షణ చర్యలను ఆదివారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. దసరా సెలవుల వల్ల భారీ రద్దీ నేపథ్యంలో బీచ్‌కు వచ్చిపోయే పర్యాటకుల విషయంలో వారి భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై పోలీసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


బీచ్ రోడ్డులో పోలీసుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అనిత

రామావతారంలో సింహాద్రినాథుడు


పూజలందుకున్న స్వామివారు

సింహాచలం, న్యూస్‌టుడే: చేతుల్లో ధనుర్బాణాలు ధరించి కోటి సూర్యప్రభలతో వెలిగిపోతూ.. చిరుమందహాసంతో కొండ దిగివచ్చిన సింహాద్రినాథుడిని దర్శించుకున్న భక్తజనం ఆధ్యాత్మిక పరవశంతో తన్మయులయ్యారు. అప్పన్న స్వామి ఆలయంలో ఆదివారం జమ్మివేట ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ధనుర్బాణాలతో శ్రీరాముడిగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. సింహగిరిపై నుంచి మెట్లమార్గంలో కొండ దిగువకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. తొలిపావంచా నుంచి స్వామివారు ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు వెళ్లి భక్తుల పూజలందుకున్నారు. అనంతరం పూలతోటలోకి ప్రవేశించి ఉత్సవ మండపంలో కొలువుదీరారు. అర్చకులు స్వామి చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. పూలతోట ఆవరణలోని శమీ వృక్షానికి ధూపదీప సేవలు జరిపి కరవాలంతో శమీదళాలను ఖండించి స్వామికి సమర్పించారు. భక్తులు శమీ వృక్షానికి ప్రదక్షిణలు చేశారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పి. వి. నరసింహం, ఈవో త్రినాథరావు ఈ పూజల్లో పాల్గొన్నారు. పూలతోటలో పూజల అనంతరం అడివివరం ప్రధాన వీధుల్లో స్వామివారు అశ్వవాహనంపై తిరువీధిలో పాల్గొని, మెట్లమార్గం గుండా తిరిగి సింహగిరికి చేరుకున్నారు.


శమీపూజ నిర్వహిస్తున్న అర్చకులు

సందడి చేద్దాం.. సరదాగా గడిపేద్దాం...



గుర్రంపై యువతి స్వారీ

ఆర్కే బీచ్ తీరం జనాలతో కళకళలాడింది. పండక్కి ఇంటికి వచ్చిన చుటాలతో నగరవాసులు తీరానికి చేరుకుని సందడి చేశారు. పాల నురుగల కెరటాలతో ఆటలాడారు. మెత్తటి ఇసుకలో గుర్రపు స్వారీ చేశారు. నీలి ఆకాశంలోకి పతంగులు ఎగరేశారు. గంతులేస్తూ ఇలా తీరమంతా కలియ తిరిగి ఆనందంగా గడిపారు. – ఈనాడు, విశాఖపట్నం



ఫ్లోటింగ్ బ్రిడ్జి సామగ్రిపై ఆటలాడుతూ..



కారు డిక్కీలో కూర్చుని ఆర్కే బీచ్ రోడ్డులో షికారు చేస్తూ..





విక్టరీ ఎట్‌సీ బీచ్‌లో గాలిపటాలతో సందడి

బాస్కెట్‌బాల్ పోటీల విజేత తూర్పుగోదావరి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో రన్నర్స్‌గా అనంతపురం, మూడో స్థానంలో విశాఖపట్నం, గుంటూరు జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా కృష్ణా జట్టు, మూడో స్థానంలో చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయని బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తన తండ్రి జీఎంసీ బాలయోగి పేరిట అమలాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్టేడియంను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామచంద్రపురంలో రెండో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసేందుకు నిధులు ఇస్తామన్నారు. తొలుత మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, గన్నమని చక్రవర్తి, ప్రముఖ డాక్టర్లు చెలికాని రామారావు, కోట సతీష్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపీ హరీష్‌మాథుర్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లా, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచిన విశాఖపట్నం జిల్లా జట్టు

ఉత్తమ ప్రదర్శనలు.. చిగురు మేఘం, స్వేచ్ఛ

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి (తెనాలి), వేదగంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి చేపట్టిన వీణా పురస్కారాల, నాటకోత్సవాలు-2024), ఏ.ఆర్.కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సమతాలికి పద్య నాటక వృత్తిగత బహుమతులు, సాంఘిక నాటక, నాటిక పోటీల ఫలితాలను వేదికపై ప్రకటించారు.

నాటిక విభాగంలో చిగురు మేఘం (గుంటూరు అమరావతి ఆర్ట్స్) ప్రథమ, నా శత్రువుకు (హైదరాబాద్ యువ భేరి థియేటర్ ఆర్గనైజేషన్) ద్వితీయ, మతమా మానవత్వమా (శ్రీకాకుళం లలిత శ్రీ కళాసమితి) తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి.

సాంఘిక నాటకం విభాగంలో స్వేచ్ఛ (హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్) ప్రథమ, మంత్రనగరి (ఉక్కు నగరం చైతన్య కళా స్రవంతి) ద్వితీయ ఉత్తమ ప్రదర్శనలుగా వచ్చాయి.

పద్య నాటక విభాగంలో వృత్తిగతంగా బహుమతులు ఇచ్చారు. బహుమతుల ప్రదానోత్సవంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళల కాణాచి గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబూ ఆర్ వడ్లమాని, కళల కాణాచి ముఖ్య సలహాదారు మునగాల శ్యాంప్రసాద్, అధ్యక్షుడు బుర్రా సాయి మాధవ్, ఆర్.ఎస్.ఆర్.(గ్రూప్స్) ఛైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీఎన్ఆర్ ఎస్ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

ఆచార్య సాయిబాబా స్ఫూర్తితో పోరాటం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ రాజ్యహింస వల్లే ఆచార్య సాయిబాబా అకాల మరణం చెందారని విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఆచార్య సాయిబాబా మృతిపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాయిబాబా స్ఫూర్తితో ప్రజాస్వామ్య శక్తులు ఏకమై ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా దసరా ఉత్సవాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో రావణ దహన కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల నడుమ శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయిసేవిని సమక్షంలో సుమారు 50 అడుగుల రావణుడి కటౌట్‌ను దహనం చేశారు. శ్రీకృష్ణభగవానుడిని స్మరిస్తూ, ఎప్పటికీ చెడుపై మంచి విజయం సాధిస్తుందని అభివర్ణిస్తూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సంతోషాల నడుమ వీక్షించారు. ఈ సందర్భంగా మందిరంలోని ఉత్సవమూర్తుల మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వేడుకగా రావణ దహనం

ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో ఆయుధపూజ



కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమి పురస్కరించుకుని నగర ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో బెల్ ఆఫ్ ఆర్మ్స్ వద్ద నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ కుటుంబ సమేతంగా ఆయుధ పూజ నిర్వహించారు. నగర ఆయుధాగారంలో దుర్గామాత చిత్రపటాన్ని అలంకరించారు.సిబ్బంది, అధికారులు, ఉపయోగించే ఆయుధాలను దుర్గ మాత చిత్రపటం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

★ అయిదుగురు అంతర్ జిల్లాల నేరస్థులు అరెస్ట్


★ రూ.5 లక్షల విలువచేసే బంగారు అభరణాలు కారు స్వాధీనం

గండేపల్లి, న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కుతారు.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో ముఠా గుట్టురట్టయింది. అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు అభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మురారి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటోఎక్కిన మరో మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ (40)తో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు (50), విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి (25), అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతి (30)ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు అభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. గండేపల్లి ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది వీరబాబు, సూరిబాబు, బాషా తదితరులు ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, ఫోన్‌లు

ద్విచక్రవాహనం ఢీకొని న్యాయవాది మృతి



రామశాస్త్రి (పాతచిత్రం)

అక్కిరెడ్డిపాలెం (నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని న్యాయవాది మృతి చెందిన ఘటన నాతయ్యపాలెం బస్టాపు సమీపంలో చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాతయ్యపాలేనికి చెందిన ఉలిమిరి రామశాస్త్రి (57) న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో సమీప దుర్గాదేవి మండపాన్ని దర్శించుకొని ఇంటికి నడిచి వెళ్తుండగా గాజువాక నుంచి షీలానగర్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. వాహనంపై ఉన్న వ్యక్తి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు ఇరువురిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రామశాస్త్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈయనకు భార్య సంధ్య, పిల్లలు సాయికుమారి, అరుణ్‌కుమార్ ఉన్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గీతం దూర విద్యా కోర్సుల్లో ప్రవేశాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీకి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఏ ఇంగ్లిష్, బీఏ, బీకామ్ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సీడీవోఈ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి వద్ద నుంచే దూర విద్యా విధానంలో ఈ కోర్సుల్ని అభ్యసించేలా ఏర్పాట్లు చేశామన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల (నవంబరు) 15వ తేదీలోగా అందజేయాలన్నారు. ఇతర వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం గీతం సీడీఎల్ వెబ్‌సైట్ cdl.gitam.edu ను పరిశీలించాలని ఆయన సూచించారు.

జనమే లేరబ్బా...

దసరా పండగ సెలవుల కోసం జనాలు ఊళ్లకు వెళ్లడంతో ఆదివారం విశాఖ నగరం వెలవెల బోయింది. ఆర్టీసీ కాంప్లెక్సులో ప్రయాణికులే కానరాలేదు. చాలా సిటీ బస్సుల్లో ప్రయాణికులు లేకపోవడంతో ఖాళీగా తిరిగాయి. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఆశీల్‌మెట్ట రోడ్డు, జగదాంబ రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. – ఈనాడు, విశాఖపట్నం.



ప్రయాణికులు లేక వెలవెలబోయిన ఆర్టీసి కాంప్లెక్స్



నిర్మానుష్యంగా ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి జగదాంబకు వెళ్లే రహదారి



వాహనాల రద్దీ లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆశీల్‌మెట్ట రోడ్డు

మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కార్పొరేషన్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు శనివారం మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

సాగర తీరంలో వైభవంగా తెప్పోత్సవం

మల్కాపురం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల ముగింపు మహోత్సవాల్లో భాగంగా శ్రీ సాగరగిరి కనకదుర్గమ్మ అమ్మవారి తెప్పోత్సవాన్ని పోర్టుట్రస్ట్ సహకారంతో నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కనులపండువగా ఆదివారం నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం తెప్పోత్సవంలో భాగంగా అమ్మవారిని సాగరగిరి కొండపై నుంచి ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో దేవాలయానికి తీసుకెళ్లారు. సముద్ర తీరంలో నిర్వహించిన వేడుకల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పర్యవేక్షించారు.



కనకదుర్గమ్మ వారు



అమ్మవారి తెప్పోత్సవం

అరకులోయలో మరింత పర్యటక అభివృద్ధి

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయని పర్యటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ తెలిపారు. పద్మాపురం ఉద్యానంలో హాట్ బెలూన్ ట్రయల్‌రన్‌ని శనివారం పీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకులోయకి ఏటా సుమారు మూడు లక్షల మంది వరకు పర్యటకులు వస్తున్నారన్నారు. వీరందరికీ కొత్త సొబగులు అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో హాట్ బెలూన్ అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. కొత్తవలస వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో త్వరలోనే పారా గ్లైడింగ్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. పద్మాపురం ఉద్యానంలో నూతనంగా ఐలవ్ అరకు అనే హోర్డింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. పద్మాపురం ఉద్యానాన్ని రాత్రి 10 గంటల వరకు సందర్శకులు వీక్షించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్లు, రోప్ లైట్లు, హెడ్ లైట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యానంలో జపనీస్ ఆర్చ్, వివిధ గార్డెన్‌లలో నేమింగ్ బోర్డుల ఏర్పాటుతోపాటు కాలిబాటలను అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. హాట్ బెలూన్ పర్యటకులను సుమారు 300 అడుగుల మేర పైకి తీసుకువెళ్లి మళ్లీ కిందకి దించుతుందన్నారు. కొత్తపల్లి జలపాతం వద్ద లేజర్ లైటింగ్, కాలిబాట ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తపల్లి, కొత్తవలస జలపాతాలను చాపరాయి మాదిరిగా అభివృద్ధి చేస్తామన్నారు.



అరకులోయలో ఎగురుతున్న హాట్ ఎయిర్ బెలూన్

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో ఓ ఖైదీ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న కర్రి లచ్చన్న (58) ఆరోగ్యం బాగోలేకపోవడంతో గతనెల 27న ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ 12వ తేదీన మృతిచెందినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. సి.ఐ. రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	122
లైవ్	147	142
డ్రెస్డ్	213	254
స్కిన్‌లెస్	243	264

అప్పన్న సన్నిధిలో సినీనటుడు

సింహాచలం, న్యూస్‌టుడే: తెలుగు సినీనటుడు సాయికుమార్ ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.



కప్పస్తంభం వద్ద సాయికుమార్

ఏపీ కాంగ్రెస్ కమిటీ క్రీడా ఛైర్మన్‌గా కమలాకర్‌రావు



గురుద్వారా, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రీడా ఛైర్మన్‌గా జాతీయ క్రీడాకారుడు **జి.వి.వి.ఎస్.కమలాకర్‌రావు** నియమితులైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పేద క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సాహం అందిస్తానని తెలియజేశారు.

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ఏయూలో ఫ్రీడమ్ రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: భారత ఇంధనం, శక్తి సంస్థ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఆంధ్రవిశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ఐ.వెంకటేశ్వరరావు మాణిక్యాలరావు పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రామునాయుడు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

పెందుర్తి

న్యూస్‌టుడే, సబ్బవరం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: సబ్బవరం పంచాయతీ కోమటివీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. స్థానికులు తరచూ అనారోగ్య బారిన పడుతున్నారు. – వి.వెంకటరమణ, సబ్బవరం

సమాధానం: పరిశీలించి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా ఏర్పాటు చేస్తాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

పల్లెల్లో అభివృద్ధి పండగ

ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కేంద్రం, ఆర్థిక సంఘాల నుంచి విడుదలయ్యే నిధులను సైతం పక్కదారి పట్టించింది. దీంతో పల్లెలు కనీస వసతులకు నోచుకోలేకపోయాయి. ప్రగతి పడకేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కనీసం పారిశుద్ధ్య నిర్వహణ పనులు కూడా చేయలేక సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పాలనపై దృష్టి సారించడంతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. గత ప్రభుత్వ తప్పులను సరిదిద్ది పల్లెల ముఖచిత్రాన్ని మార్చేందుకు కృషి చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్రం ఇచ్చే నిధులు నేరుగా పంచాయతీ ఖాతాల్లో పడుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తీరనున్నాయి. ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుంది. ఉపాధిహామీ పథకం నిధులతో సీసీరోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.


పరవాడ గ్రామపంచాయతీ కార్యాలయం

నియోజకవర్గంలోని 54 పంచాయతీల్లో..

పెందుర్తి మండలంలో 15, సబ్బవరంలో 24, పరవాడలో 15 చొప్పున మొత్తం 54 పంచాయతీలు ఉన్నాయి. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా 54 పంచాయతీల్లో రూ. 15.26 కోట్లు వెచ్చించి 208 పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల ప్రణాళికలను మండల పరిషత్తు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తీర్చిదిద్దారు. వారోత్సవాల్లో ఆయా పనులకు శంకుస్థాపన చేసి వచ్చే సంక్రాంతి నాటికి పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తారు.

మండలాల వారీగా చేపటనున్న పనులు, నిధులు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో..)
పెందుర్తి	80	4.46
పరవాడ	65	6.74
సబ్బవరం	63	4.06
మొత్తం	208	15.26

గ్రామసభలోనే పనులను గుర్తించేలా..

గ్రామ పంచాయతీల్లో గత ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రజలు, పాలకులు సమక్షంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పల్లెల్లో పెండింగ్ పనులు, ప్రధాన సమస్యలు, జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు. ఏయే పనులు చేపట్టాలనే విషయంపై సమష్టిగా నిర్ణయం తీసుకోవడంతో పాటు ప్రణాళికలు రూపొందించారు. తొలి ప్రాధాన్యంగా సీసీరోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ప్రజల నుంచి వినతులకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి..



పల్లె పండగ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తాం. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చేతులమీదుగా శంకుస్థాపనలు చేయిస్తాం. డిసెంబరు 31లోగా పనులను పూర్తి చేస్తాం. జనవరిలో మరలా పల్లె పండగ వారోత్సవాలు జరిపి అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేస్తాం. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి. – శ్యామ్‌సుందర్, ఎంపీడీవో, పరవాడ

చేయి చేయి కలిపి.. షెడ్డు నిర్మించి..


కొత్తగా నిర్మించిన శ్మశానవాటిక వద్ద దాతలు

గవరజగ్గయ్యపాలెం (వేపగుంట), న్యూస్‌టుడే: గ్రామానికి ఏదైనా మంచిపని చేయాలని యువత తలచి ముందడుగేస్తే ఎలాంటి అభివృద్ధి పనులు చేయొచ్చో నిరూపించారు గవరజగ్గయ్యపాలెం గ్రామంలోని యువకులు. ఆ గ్రామంలోని శ్మశానవాటిక షెడ్డు శిథిలావస్థకు చేరి దహన సంస్కారాల సమయంలో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాడైన షెడ్డు, తుప్పలతో నిండిన శ్మశానవాటిక ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని గ్రామ యువకులు బుదిరెడ్డి శివ, ముత్యా అర్జున్, పోలమరశెట్టి బాను, పోలారావు మురళీకృష్ణ, ముత్యా గోపి, గనిశెట్టి కుమార్, గల్లా భాగ్యరాజు, గండ్రెడ్డి శ్యామ్‌కుమార్, గండ్రెడ్డి అమృతకుమార్, తనకాల అనిల్ కుమార్, చిడగం చక్రిసాయి, అశోక్, గల్లా త్రినాథ్, బొడ్డేటి వినోద్, బాలు, వాసు, సంతోష్, ముత్యా సత్తిబాబు, తనకాల చలపతిరావు, పోలమరశెట్టి [illegible], మురళి, మస్తూరావు, నాగేశ్వరరావు కలిసి సుమారు రూ. 50 వేలు చందా వేసుకున్నారు. పాత షెడ్డును తొలగించి కొత్తది నిర్మించారు. తుప్పలను తొలగించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. యువకులు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట దరి రవినగర్ శేషాద్రి శిఖరంపైగల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మతార శ్రవణ నక్షత్ర వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రవణ నక్షత్రం, విజయదశమి ఒకేరోజు రావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలతో అర్చనలు జరిపారు. [illegible] దంపతులు, యజ్ఞేశ్వర్, ప్రవళిక కుటుంబీకుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి పార్వతీ పునరావాస కాలనీ కొండపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర పూజలు ఘనంగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు.


రవినగర్ కల్యాణ వేంకటేశ్వరుడికి హారతిస్తున్న అర్చకుడు


ఈ.భోనంగి శ్రీనివాసుడు

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

పెందుర్తి, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన దేవీ విగ్రహాల నిమజ్జనోత్సవాలను నగర సీపీ శంఖబ్రత బాగ్చీ పరిశీలించారు. పెందుర్తి, సరిపల్లిలోని చెరువుల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ ఏసీపీ అప్పల నరసింహమూర్తి, పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరిపల్లి చెరువు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె పండగ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం తెలిపింది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన సుమారు 216 పనులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు శంకుస్థాపనలు చేస్తారని, ఆ మేరకు రోజువారీ షెడ్యూల్‌ను ప్రకటనలో తెలియజేశారు.

★ 14న ముదపాక పంచాయతీలో ఉదయం 9 గంటల నుంచి పల్లె పండగ ప్రారంభమవుతుంది. అనంతరం గుర్రమ్మపాలెం, వాలిమెరక, ఎస్‌ఆర్‌పురం మధ్యాహ్నం గవరపాలెం, గొరపల్లి, పినగాడి, రాంపురం గ్రామాల్లో శంకుస్థాపనలు చేస్తారు. 17న జెర్రిపోతులపాలెం, చింతగట్ల, పెదగాడి, చింతలగ్రహారం, సరిపల్లి, జుత్తాడ, పాలెం, రాజయ్యపేట కార్యక్రమాలు జరుగనున్నాయి.

★ 15న సబ్బవరం మండలంలోని మొగలిపురం, మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, అంతకాపల్లి, గొటివాడ, గాలిభీమవరం, ఇరువాడ, 18న వంగలి, టెక్కిలిపాలెం, రాయపుర అగ్రహారం, బంగారమ్మపాలెం, ఆరిపాక, నల్లరేగుపాలెం, నారపాడు, బాట జంగాపాలెం, అసకపల్లి, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం, 20న సబ్బవరం, అమృతపురం, తవ్వవానిపాలెంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు.


పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే

★ 16న పరవాడ మండలంలోని పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం, ఈ.భోనంగి, పి.భోనంగి, 19న ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, రావాడ, కలపాక గ్రామాల్లో పల్లె పండగలు జరుపుతారని ప్రకటనలో ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

సిరుల స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేదపఠనాల మధ్య స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.


పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మురుబాయి గ్రామంలో దుర్గాదేవి ఉత్సవాలు సందర్భంగా శనివారం దుర్గా బాయ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 23 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో వైజాగ్, గాజువాక, వడ్లపూడి, లోకల్ కృష్ణా బాయ్స్ జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి వరసగా రూ.12, వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను స్థానిక నాయకులు మంత్రి రవి, కాకి శ్రీను, సర్వరే ఆలం, నక్క శ్రీను చేతుల మీదుగా అందజేశారు. పెదతాడి, పరవాడలో పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మురుబాయిలో వాలీబాల్ విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు, కమిటీ ప్రతినిధులు


పరవాడలో బహుమతులు పంపిణీ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు నాట్యసంస్థల కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు పాల్గొన్నారు.


పెందుర్తిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..


రాంపురం దరి మహాకామేశ్వరి పీఠంలో..


ఎస్ఆర్‌పురంలో రాజరాజేశ్వరి..



శారదా పీఠంలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న పీఠాధిపతులు


శ్రమశక్తినగర్‌లో..


నాయుడుతోటలో..

జయ శుభకారిణి.. విజయ రూపిణి

అసుర గణాలను సంహరించి విజయ రూపిణిగా అవతరించిన జగన్మాతకు భక్తులు నవరాత్రులు ప్రత్యేక పూజలు జరిపి ఘనంగా వీడ్కోలు పలికారు. నియోజకవర్గంలో పలు ఆలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు వైభవోపేతంగా జరిగిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం విజయదశమిని పురస్కరించుకుని ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయాల్లో విశేష హోమాలు, పూర్ణాహుతులు, ఉద్యాపన పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవార్ల ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు శోభాయమానంగా నిర్వహించారు. పలు చోట్ల అన్న సమారాధన చేశారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


సింహాద్రి ఎన్టీపీసీలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న అమ్మవారి ప్రతిమలు


చింతలగ్రహారం కృష్ణాలయంలో సారె సమర్పణ


పరవాడలో మహిళల కోలాటం


కృష్ణానగర్‌లో కలశాలతో ఊరేగింపు


పెదనాయుడుపాలెంలో..



దేవీపురం రాజరాజేశ్వరి మణిపురం భువనేశ్వరి


దీపాంజలినగర్‌లో రావణాసుర వధ

గెడ్డలోని నీరు రహదారిపైకి..

గెడ్డలో ప్రవహించాల్సిన వరద రోడ్లపై పారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ మండలం కలపాక నుంచి పిట్టవానిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలోని గెడ్డవాగు వద్ద కల్వర్టు నిర్మించకపోవడంతో వర్షాల సమయంలో పెద్దఎత్తున వరద రహదారిపై ప్రవహించడంతో పాటు రోడ్డు కోతకు గురవుతోంది. ఆ సమయంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదని పరిసర గ్రామాల ప్రజల, వాహనదారులు వాపోతున్నారు. ఎన్టీపీసీ, హిందుజా పరిశ్రమలకు వెళ్లే కార్మికులతో పాటు పిట్టవానిపాలెం, కలపాక, దేవాడ, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, మరడదాసరిపేట గ్రామాల ప్రజలతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – పరవాడ, న్యూస్‌టుడే

దర్పణం




వేలం నిర్వహించే ప్రాంగణం పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వేలం ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మద్యం వేలం ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సిరిపురం బాలల ప్రాంగణాన్ని సందర్శించారు. మద్యం వేలం ప్రక్రియలో దరఖాస్తులు అధికంగా రావడంతో ఆశావహులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటర్లు అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. వేలం ప్రక్రియ సజావుగా, సక్రమంగా ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

క్రైం ఎస్సై బాధ్యతల స్వీకరణ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం నేరవిభాగం ఎస్సైగా జి.తేజేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్థులు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైల్వేలో స్వచ్ఛతకు కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : రైళ్ల వినియోగదారులకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి మేము కృషిచేస్తామని డి.ఆర్.ఎం. సౌరభ్‌ప్రసాద్ అన్నారు. వాల్తేరు డివిజన్‌లో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. వాల్తేరు డివిజన్ పర్యావరణ విభాగం, ఎన్.జి.ఒ.లు సంయుక్తంగా 'స్వచ్ఛపరివార్ - స్వచ్ఛ సంవాద్' పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని డివిజన్‌లో పలు ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు.



శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

సబ్బవరం తహసీల్దారుగా చిన్ని కృష్ణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల తహసీల్దారుగా బి.చిన్ని కృష్ణ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాకు కేటాయించడంతో ఇక్కడి కలెక్టర్ విజయకృష్ణన్ అతన్ని సబ్బవరం తహసీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జరీ చేశారు. ఈ మేరకు సోమవారం విధుల్లో చేరనున్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అమలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం అమలులోకి తెచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తండోపతండాలుగా ప్రజలు తరలి వచ్చిన ఫిర్యాదులు అందజేయడాన్ని కమిషనర్ సంపత్ కుమార్ చూశారు. దీంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శాశ్వత ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవారు తమ పేరు, ఆధార్, సమస్యను సోమవారం నుంచి శనివారం వరకు పని దినాలలో అందించేలా చర్యలు తీసుకున్నారు. దీని కోసం జీవీఎంసీలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ కేంద్రంలో ఎలాంటి ఫిర్యాదులు స్వీకరిస్తారో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయించారు. అయినా సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల రాక తగ్గడం లేదు. దీంతో ప్రత్యేకంగా ఐదుగురు సిబ్బందిని నియమించి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. నేరుగా కమిషనర్ లేదా మేయరును కలిసి ఫిర్యాదు చేయాలనే ఉద్దేశ్యం ఫిర్యాదీదారుల్లో కనిపిస్తోంది.


వివరాలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు


మహా విశాఖ నగరపాలక సంస్థలో ఆధునికీకరించిన ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం

స్వల్ప మార్పులతో ఆదరణ

గత కమిషనర్లు అవలంబించిన విధానాలను తర్వాత వచ్చిన కమిషనర్లు పట్టించుకోవడం లేదు. గతంలో జీవీఎంసీలో ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రికార్డింగ్ సిస్టం) అమలు చేసేవారు. ఈ విధానంలో నగర ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేసేవారు. కమిషనర్లు ఉదయం పూట క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సి ఉంటుంది. దీంతో నేరుగా ఐవీఆర్ఎస్ కేంద్రానికి వెళ్లి అక్కడికి వచ్చిన సమస్యలపై ఫిర్యాదీదారులతో మాట్లాడేవారు. తర్వాత క్షేత్ర స్థాయికి వెళ్లి ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రానికి వచ్చిన వారితో కమిషనర్ లేదా మేయరు ఇతర అధికారులెవరైనా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యను తీసుకుని పరిష్కరిస్తే ఈ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. తద్వారా సోమవారమే కాకుండా మిగతా రోజుల్లోనూ ఫిర్యాదులు ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఫిర్యాదుల కేంద్రానికి వచ్చే సమస్యలపై వారానికోసారి సమీక్ష నిర్వహిస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయాన్ ది హంటర్

పేదలకు, చిన్నారులకు వితరణ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద పుట్టినరోజు సందర్భంగా భీమిలి ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో శనివారం 100 మందికి అన్నదానం చేశారు. రాతపుస్తకాలు, మిఠాయిలు అందించారు. జీరుపేటలో పేదలకు నిత్యావసరాలు, ముగ్గురికి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. తాళ్లవలస అనాథ బాలల సంరక్షణ కేంద్రంలోని బాలలకు మూడు పూటలా భోజనాలు పెట్టారు. వెంపాడ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ నాల్గోవార్డు పరిధి కాపులుప్పాడ వుడా లేఅవుట్ రోడ్డు అధ్వానంగా ఉంది. –కోడిబోయిన అప్పలనాయుడు, కె.గొల్లలపాలెం

సమాధానం: ఈ రోడ్డు పునర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. –సుమన్ (భీమిలి జోన్ పబ్లిక్ వర్క్స్ ఏఈ)

సమస్య: తగరపువలస కూడలి నుంచి కొండపేట పంపుహౌస్ రోడ్డు అసంపూర్తిగా ఉంది. వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. –టి.అప్పలరాజు (కొండపేట)

సమాధానం: రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. –ప్రేమ ప్రసన్నవాణి (భీమిలి జోనల్ కమిషనరు)

సమస్య: తగరపువలస కూడలి, మార్కెట్ ప్రాంతం, భీమిలి రోడ్డు, విజయదుర్గా ఆలయంలోని సర్వీసురోడ్డు, యూనియన్ బ్యాంకు మార్గాల్లో ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –దొంతల పైడిరాజు (బాలాజీనగర్)

సమాధానం: సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తాం. జీవీఎంసీ ప్రణాళిక విభాగం సహకారంతో రోడ్లపై ఆక్రమణలు తొలగించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – చిరంజీవి (ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టరు)

స్వచ్ఛంద సేవ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

రుషికొండ, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, వైద్యులు బృందాలుగా ఏర్పడి విభిన్న రీతుల్లో సామాజిక సేవా కార్యకలాపాలు నిర్వర్తిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మానవ సేవే.. మాధవ సేవగా భావించి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతో వీరు ముందుకు సాగుతున్నారు.


బాధితుల్ని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న వాటర్ స్పోర్ట్స్ నిపుణులు (పాతచిత్రం)

« స్థానిక ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రంలోని వరద బాధితులకు తమ వంతు చేయూతనందించి పలువురి మన్ననలు అందుకుంది. ముఖ్యంగా గత నెలలో విజయవాడ, ఖమ్మం ప్రాంతాల్లోని వరద బాధితులకు అక్షయపాత్ర, రామకృష్ణ మిషన్ ప్రతినిధుల సమక్షంలో రూ.2.88 లక్షలు చెక్కు రూపంలో సాయం చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గోకాడ సూర్యనారాయణ తెలిపారు. ఈ సంస్థను 2010లో ప్రారంభించామన్నారు. దేశ వ్యాప్తంగా ఇందులో ఉన్న 350 మంది సభ్యులు సమకూర్చే నిధులతో పలు వితరణ కార్యక్రమాలు చేపడుతున్నామని, గతంలో హుద్‌హుద్, కొవిడ్ సందర్భాల్లోనూ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, రోగులకు ధన సహాయం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

« రుషికొండ బీచ్‌లోని లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ (జలక్రీడల నిపుణులు)వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందిన పలువురు యువకులు విజయవాడతో పాటు.. రాజమహేంద్రవరం లంక గ్రామాల్లోని వరద బాధితులకు సేవలందించారు. సంబంధిత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.బలరాంనాయుడు ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. సంబంధిత జిల్లా ప్రభుత్వ యంత్రాంగాలు సమకూర్చిన పడవలు అందించిన సాంకేతిక వస్తు సామగ్రి సాయంతో ఈ ప్రక్రియ చేపట్టారు.

« గీతం వైద్య కళాశాల ఆసుపత్రి వైద్య బృంద సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండల పరిధి జామిగూడ తదితర గిరిజన గ్రామాల్లో ఇటీవల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ సందీప్ (జనరల్ మెడిసిన్), స్త్రీ శిశు వైద్య నిపుణులు డాక్టర్ చందన్, షమిత పర్యవేక్షణలో గ్రామాల వాసులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులు, మహిళల్లో పోషకాహారలోపం వల్ల వచ్చే సమస్యలు ఇతరత్రా సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే పలు ముఖ్యాంశాలపై అవగాహన కల్పించారు.


అక్షయపాత్ర ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న ఆసరా సంస్థ అధ్యక్షుడు గోకాడ సూర్యనారాయణ తదితరులు (పాతచిత్రం)


గిరిజన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

డిసెంబరులో భీమిలి ఉత్సవ్: గంటా


చిప్పాడ జట్టుకు విజేత ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

గ్రామీణభీమిలి: ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి మూడ్రోజుల పాటు భీమిలి ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీల ముగింపోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోలాటం, తదితర సాంస్కృతిక పోటీలను ఇక నుంచి ఏటా నిర్వహించనున్నామన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి పోటీల స్ఫూర్తితో గాజువాకలోనూ ఈ తరహా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ విభాగంలో చిప్పాడ, గెద్దపేట, ముచ్చెర్ల, జూనియర్ విభాగంలో పాండ్రంగి, యాతకుమ్మరిపాలెం, చందక జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు అతిథులు నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఛైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, ఆర్డీవో సంగీత్ మాథుర్, ఎమ్పీడీవో కనకల రమేశ్ నాయుడు, భాజపా, జనసేన ఇన్‌ఛార్జులు కంటుభుక్త రామానాయుడు, పంచకర్ల సందీప్, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సరగడ అప్పారావు, బోర బంగారరెడ్డి, తెదేపా ఎమ్పీటీసీ సభ్యులు కోరాడ రమణ, చుక్కా శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన


పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవం కనుల పండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రామ అష్టోత్తర హోమం, మహా మంగళ హారతి, రావణ వధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు చేపట్టిన శ్రీరామలీలా ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిష్కించిన భక్త దాస, అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.


హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హోమపూజ

రేవు అమ్మోరు పండగ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలం కొత్తూరు, మంగమారిపేట గ్రామాల్లో రేవు అమ్మోరు పండగను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మత్స్యవేట సమృద్ధిగా లభించాలని, వేటకు వెళ్లే మత్స్యకారులు క్షేమంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ పండగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14 మత్స్యకార గ్రామాల కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జయమునీయవే.. అమ్మా భవానీ..


రాములమ్మ థియేటర్ వద్ద..


సింహగిరిపై బాలాత్రిపుర సుందరి అమ్మవారు


గోశాల లేఅవుట్‌లో..


భీమిలి శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..


వాసవీ కన్యకాపరమేశ్వరి


చంద్రంపాలెంలో..



గీతం వైద్య కళాశాల ప్రాంగణంలో..


సంగివలస పోలమాంబ గుడిలో..


తొలిపావంచా వద్ద..

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో వైభవోపేతంగా ముగిశాయి. దసరా సందర్భంగా అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిగా భక్తుల పూజలందుకున్నారు. ఆలయాల్లో విశేష హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, అన్న సమారాధనలు, ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సింహాచలం, తగరపువలస, భీమునిపట్నం, కొమ్మాది, పద్మనాభం, సాగర్‌నగర్, మధురవాడ, పీఎంపాలెం


విజయదుర్గా ఆలయంలో..


పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో..


మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో..


పీఎంపాలెం శృంగేరి మఠంలో..


తగరపువలసలో..


శ్రీసిద్ధేశ్వరస్వామి పీఠంలో..


సాగర్‌నగర్ బంగారమ్మ గుడిలో..


రుషికొండ బీచ్‌లోని సప్తరుషీశ్వరాలయంలో..


గుడ్లవానిపాలెంలో..


టైలర్స్ కాలనీలో..


మానం ఆంజనేయులునగర్‌లో..


కారుషెడ్డు కూడలి బబ్బేలమ్మ గుడిలో..

గోతులతో తరచూ ప్రమాదాలు

భీమునిపట్నం: ప్రయివేటు నెట్‌వర్క్ కేబుళ్ల కోసం రోడ్డు పక్కన తవ్వేసిన గోతులను సరిగా పూడ్చక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భీమిలి చిన్నబజార్ విలియం స్ట్రీట్ వద్ద రోడ్డు పక్కన గోతులను పూర్తిస్థాయిలో పూడ్చలేదు. దీంతో ఇతర మార్గాల ద్వారా విలియం స్ట్రీట్ మీదుగా తగరపువలస వైపు వెళ్లే వాహన చోదకులు ఈ రోడ్డు మలుపులో పట్టుతప్పి పడిపోతున్నారు. ఇప్పటి వరకు అనేక మంది కాళ్లు, చేతులు విరిగి గాయాలపాలయ్యారు. ఈ విషయంలో అధికారులు ఈ రోడ్డు అంచుల్లోని గోతులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు, రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో విద్యుత్తు స్తంభాలను తాకుతున్న చెట్లకొమ్మలు, పాదులను తొలగించేందుకు ఈనెల 14, 15 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయాలని నిర్ణయించారు. అల్లుకున్న నిర్లక్ష్యం శీర్షికన ఇటీవల 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న పాదులు, చెట్ల కొమ్మలు తొలగించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా భీమిలి పట్టణ పరిధిలోని ఎగువపేట, బోయివీధి, నేరెళ్లవలస, గొల్లవీధి, పెద్దబజారు ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని సహాయ ఇంజినీరు యు.సకరయ్య పేర్కొన్నారు.

ఉద్యోగి ఆత్మహత్య

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడలో ఓ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.....జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంలో ఏపీ ఫైబర్‌నెట్ ఉద్యోగి బి.సత్తిబాబు(30) తండ్రి అమ్మతల్లి, అన్నయ్య కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం దసరా నేపథ్యంలో ఇంట్లో పూజ ముగిసిన తర్వాత పడకగదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. మధ్యాహ్న భోజన సమయంలో కుటుంబ సభ్యులు ఎంతగా పిలుస్తున్నా తలుపు తీయలేదు. అనుమానంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

స్కేటింగ్‌లో బాలుడి ప్రతిభ


తరణ్‌యాదవ్

ఎండాడ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గొల్లల ఎండాడ గ్రామానికి చెందిన ఒమ్మి తరణ్‌యాదవ్ రెండు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 5, 6 రింకుల్లో బాలుడు ప్రతిభ కనబర్చి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో, కాకినాడలో జరిగిన పోటీల్లో సైతం బంగారు, రజత పతకాలు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా బాలుడి ప్రతిభను వీఎంఆర్డీఏ సంయుక్త కమిషనర్ కె.రమేష్, శిక్షకులు, నిర్వాహకులు, తదితరులు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీల్లో క్రీడాకారులకు పతకాలు

ఎం.వి.పి.కాలనీ: ఇటీవల వుడాపార్కు, భీమిలి డ్రీమ్ వ్యాలీలో జరిగిన జిల్లాస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పతకాలను కైవసం చేసుకున్నారు. స్పీడ్ విభాగంలో చాందిని బంగారు, రజత పతకం గెలుచుకున్నారు. వర్ష జమల్లా మూడు బంగారు పతకాలు, మనిస్విని బంగారుపతకం, ఆల్ఫిన్ డౌన్‌హిల్‌లో ప్రభవ్ కాంస్యపతకం, వెంకటగిరి దీక్షిత రజత పతకం, అభినవ్ కాంస్యపతకం సాధించారు. స్కేటింగ్ సంఘం అధ్యక్షులు రమేష్‌చంద్ర, కార్యదర్శి లక్ష్మణ్‌లు అభినందించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో దసరా పండగ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం సందర్శకులను అలరించాయి. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యరూపకాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు కనకమహాలక్ష్మీ దర్శకత్వం వహించారు. పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.



కనులపండువగా తిరువీధి


అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి ఆదివారం రాత్రి అశ్వవాహనంపై అడివివరం గ్రామంలో ఊరేగారు. పూలతోటలో శమీ పూజోత్సవం అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం ఆవరణలోని ఉద్యానమండపంలో సేదతీర్చారు. శీతల నివేదనలు సమర్పించిన అనంతరం అశ్వవాహనంపై స్వామిని అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తులు గోవింద నామస్మరణల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి తిరువీధి వైభోవపేతంగా జరిగింది. గ్రామస్థులు రంగవల్లికలతో స్వామికి స్వాగతం పలికారు. పూలు, ఫలహారాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గాదేవి ఉత్సవాలకు విరాళం

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస కూడలిలో స్థానిక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాలకు భీమిలి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోరాడ నాగభూషణరావు ఆదివారం రూ.10వేల విరాళం అందించారు. అంతకుముందు అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా వేములవలస ఉపసర్పంచి కోరాడ జ్ఞానేశ్వర్ నవీన్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ నమ్మివానిపాలెంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో ఆయన సమాధి పర్వ దినోత్సవాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, తెదేపా మాజీ జడ్పీటీసీ సభ్యులు సరగడ అప్పారావు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, పల్లకీ సేవ, తిరువీధి వైభవంగా జరిగాయి. సుమారు 500 మంది పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇలా ఉంటే రాకపోకలెలా..


గోస్తనీ వంతెనపై ఇలాంటి గోతులెన్నో..

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం గ్రామం వద్ద గోస్తనీ నదిపై ఉన్న వంతెన నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా తయారైంది. ఇప్పటికే వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ (రక్షణ గోడ) చాలా భాగం శిథిలం కాగా ఇప్పుడు వంతెనపై పలుచోట్ల గోతులు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాల రాకపోకల సమయంలో పెద్ద శబ్దాలు వస్తుండడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైన రెయిలింగ్

దర్పణం

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా...

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు నుంచి సాగర్‌నగర్ మీదుగా ఎండాడ ప్రాంతాలకు వెళ్లే మార్గంలో గుడ్లవానిపాలెం ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఓ మ్యాన్‌హోల్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రాధాన్య మార్గంలో దాదాపు 40 రోజులుగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఎదురుగా బస్సులు, లారీలు ఇతరత్రా భారీ వాహనాలు వచ్చే సందర్భాల్లో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సాగర్‌నగర్ వాసులు కోరుతున్నారు.


గుడ్లవానిపాలెం ప్రభుత్వ పాఠశాల సమీప రహదారిలో ఇలా..

నేడు ఎమ్మెల్యే పర్యటన రద్దు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండల పరిషత్తు కార్యాలయం వేదికగా సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అనివార్య కారణాల వల్ల ఎమ్మెల్యే పర్యటన రద్దయినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు

మధురవాడ, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు ముగియడంతో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం మధురవాడ ఆర్టీసీ డిపో నుంచి బస్సులు సిద్ధం చేసినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ(విశాఖ) డిప్యూటీ ఇన్‌ఛార్జి సీఎంఈ బి.అప్పలనాయుడు అన్నారు. ఇందులో భాగంగా ఆదివారం మేనేజర్ పీబీ ఎంకే రాజుతో కలిసి మధురవాడ డిపోలోని గ్యారేజ్, బస్సుల స్థితిగతులను పరిశీలించారు. ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.దుర్యోధనుడు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో కోలాహలం



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో రుషికొండ బీచ్‌కు శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ మేరకు విహార యాత్రలో భాగంగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి విచ్చేసిన వీరు ఇక్కడి ఆహ్లాదకర ప్రదేశాల్లో ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

విశాఖ తూర్పు

పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

గురుద్వారా, న్యూస్‌టుడే : సంగీత జనకులం వ్యవస్థాపకుడైన కులపతి ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన రూ.5 స్టాంప్‌ను ఆదాయ పన్నుల శాఖ అధికారి వి.నాగసూర్యరావు ఆవిష్కరించారు. ఆదివారం సీతమ్మధారలో సంగీత జనకులం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం ద్వారా 20వేల మందికి ఉచితంగా సంగీతం నేర్పించారన్నారు. అనంతరం పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించండి



▲ అలంకారప్రాయంగా బోరుబావి

← రహదారి మధ్యలో రంధ్రం

ఎంఎంటీసీ కాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే

ఎంఎంటీసీకాలనీలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రహదారుల మధ్యలో రంధ్రాలు పడితే ఇక అంతే సంగతులు వాటిని మరమ్మతులు చేసేవారు కరవయ్యారు. ఈ కాలనీలో బోరు బావులు ఉన్నా.. అలంకారప్రాయమే తప్ప వాటిలో ఓ చుక్క నీరు రాలదు. కొన్ని చోట్ల చెట్టు కొమ్మలు రోడ్డుమీద పడి ఉన్నా వాటిని తొలగించేవారు కరవయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

అ వీ ఇ వీ

ఏయూలో ఫ్రీడమ్ రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారత ఇంధనం, శక్తి సంస్థ(ఐపీఈ) ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఆంధ్రవిశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ఐ.వెంకటేశ్వరరావు మాణిక్యాలరావు పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రామునాయుడు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఉద్యోగి ఆత్మహత్య

పీఎంపాలెం, న్యూస్‌టుడే: .జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంలో ఏపీ ఫైబర్‌నెట్ ఉద్యోగి బి.సత్తిబాబు(30) తండ్రి అమ్మతల్లి, అన్నయ్య కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం ఇంట్లో పూజ ముగిసిన తర్వాత పడకగదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. మధ్యాహ్న భోజన సమయంలో కుటుంబ సభ్యులు ఎంతగా పిలుస్తున్నా తలుపు తీయలేదు. అనుమానంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

కనకమహాలక్ష్మి సేవలో ప్రముఖులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దసరా పర్వదినమైన శనివారం నాడు పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ, అనకాపల్లి జేసీ జాహ్నవి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈఓ కె.శోభారాణి, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, ఈఈ సిహెచ్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఉద్యానవనం... అధ్వానం...!



ప్రమాదకరంగా మారిన ప్రహరి


న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

ఆహ్లాదాన్ని అందించాల్సిన తీర ప్రాంతంలోని ఉద్యానవనం నిర్వహణ కరవై వెలవెలబోతోంది. ఆర్కేబీచ్ దరి నొవొటెల్ హోటల్ ఎదురుగా ఉన్న బాలల పార్కు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పార్కులోని ఆట వస్తువులు మూలకు చేరాయి. ఇక ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన బొమ్మలు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారాయి. పార్కు ఆవరణలో ఉన్న ఫౌంటెయిన్ పనిచేయడం లేదు. పార్కు నిర్వహణపై జీవీఎంసీ దృష్టి సారించకపోవటంతో పార్కుకు వచ్చే వారి సంఖ్య కరవైంది. ఉద్యానవనంలో సేదతీరేందుకు పచ్చదనం లేకపోవటంతో పాటు ప్రహరి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ప్రహరీకి ఆనుకుని ఇసుక కోతకు గురైంది. బీచ్‌వైపు కనీసం ప్రహరీ లేకపోవటంతో చిన్నారులు అటుగా వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకుంది. పార్కు ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో సందర్శకులు కరవయ్యారు. ఇప్పటికైనా జీవీఎంసీ యంత్రాంగం ఈ ఉద్యానవనంపై దృష్టిసారించి, ఆకర్షణీయమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.



ఉయ్యాల కరవు





రంగులు వెలిసిన బొమ్మలు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జన ప్రాంతాలను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సందర్శించారు. పెదజాలారిపేట, సాగర్‌నగర్, భీమిలి బీచ్, పెందుర్తి, అప్పికొండ తదితర ప్రాంతాలను ఆయన సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సిబ్బందితో పాటు సరిపడినంత గత ఈతగాళ్లు ఉన్నదీ లేనిది పరిశీలించారు. సముద్రంలోకి నేరుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. విగ్రహాలు తీసుకువచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శనలు



కూచిపూడి నృత్యప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు నాట్యసంస్థల కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. పలువురు కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, కూచి కళాక్షేత్ర ప్రిన్సిపల్ హరిరామమూర్తి, విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో నృత్యరూపకం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : తి.తి.దే.కు చెందిన గోదా సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకట అన్నమాచార్య సేవా ట్రస్టు కళాకారులు నృత్య రూపకాలను ప్రదర్శించారు. నవరాత్రి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దేవస్థానం సహకారంతో అన్నమాచార్య సేవా ట్రస్టు కళాకారులు గోవింద నామార్చన, భరతనాట్యం ప్రదర్శించారు. తాళ్లపాక సందీప్‌కుమార్ బృందంచే అష్టలక్ష్మీ నృత్యరూపకం, వేంకటేశ్వరస్వామి వైభవం వంటి నృత్యరూపకాలను ప్రదర్శించి మెప్పించారు.



నృత్యరూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని ఎంవీపీకాలనీ సెక్టారు-1 హరితవనం ఉద్యానవనంలో జమ్మిచెట్టుకు పూజలు జరిపారు. గ్రీన్‌క్లైమెట్ సంస్థ ఆధ్వర్యంలో పండగ పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం విజయదశమి పురస్కరించుకుని జమ్మి చెట్టు విశిష్టతను వివరించారు. జమ్మి చెట్టుకు పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య, గ్రీన్‌క్లైమెట్ టీమ్ వ్యవస్థాపకులు జె.వి.రత్నం, పార్కు కమిటీ అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో దీపారాధన



ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమి పురస్కరించుకుని శనివారం శిర్డీ సాయిబాబా పుణ్యతిథి పురస్కరించుకుని ప్రత్యేకపూజలు జరిపారు. ఎంవీపీకాలనీ సెక్టారు-6 పార్వతీ ముక్తీశ్వరాలయంలో శరన్నవరాత్రి పదోరోజు శమీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు, భక్తులు పాల్గొని బాబా ఆలయం వద్ద దీపాలు వెలిగించారు.

← సాయిబాబా ఆలయంలో దీపాలంకరణ

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ ఉషోదయకూడలికి వెళ్లే రహదారిలో ఆదర్శనగర్ మలుపు వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. – వినయ్

సమాధానం : సిబ్బందిని నియమించి వ్యర్థాలను తరలిస్తాం.

– ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్వచ్ఛమైన వాతావరణానికి కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : రైల్ల వినియోగదారులకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి మేము కృషిచేస్తామని డి.ఆర్.ఎం. సౌరభ్‌ప్రసాద్ అన్నారు. వాల్తేరు డివిజన్‌లో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. వాల్తేరు డివిజన్ పర్యావరణ విభాగం, ఎన్.జి.ఒ.లు సంయుక్తంగా 'స్వచ్ఛపరివార్ - స్వచ్ఛ సంవాద్' పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని డివిజన్‌లో పలు ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు.



శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

స్కేటింగ్‌లో పతకాల పంట

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇటీవల పుడాపార్కు, భీమిలి డ్రీమ్ వ్యాలీలో జరిగిన జిల్లాస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పతకాలను కైవసం చేసుకున్నారు. స్పీడ్ విభాగంలో చాందిని బంగారు, రజత పతకం గెలుచుకున్నారు. వర్ష జమల్లా మూడు బంగారు పతకాలు, మనిస్విని బంగారుపతకం, ఆల్పిన్ డౌన్‌హిల్‌లో ప్రభవ్ కాంస్యపతకం, వెంకటగిరి దీక్షిత రజత పతకం, అభినవ్ కాంస్యపతకం సాధించారు. స్కేటింగ్ సంఘం అధ్యక్షులు రమేష్‌చంద్ర, కార్యదర్శి లక్ష్మణ్‌లు అభినందించారు.



పతకాలు సాధించిన స్కేటర్లు

అమ్మలగన్న అమ్మ.. దుర్గమ్మ

భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలు



విశేష అలంకరణలో సెక్టారు-6 వేంకటేశ్వరస్వామి



వెంకోజీపాలెంలో చందన అలంకరణలో వేంకటేశ్వరస్వామి



భద్రం సామాజిక భవనంలో..



ఎంవీపీ సెక్టారు-11లో కనకదుర్గ అమ్మవారు



లలితమ్మవారు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : దసరా పురస్కరించుకుని జరిగిన దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. విజయదశమి పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఎంవీపీకాలనీ సెక్టారు-6లోని వేంకటేశ్వరస్వామి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చందనంతో అలంకరించారు.

★ విజయదశమిని పురస్కరించుకుని ఎంవీపీకాలనీ సెక్టారు-6 భద్రం సామాజిక భవనంలో సాయి సుధాకర పూర్ణానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో జరిపారు. వాల్తేరు దరి విజయదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదోవార్డు పరిధిలోని ఎస్ఐజీ.నగర్, రవీంద్రనగర్, ఇందిరాగాంధీనగర్‌లలో దసరా ఉత్సవాలు స్థానిక యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కుంకుమార్చనలు, తిరువీధి ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.



పూజల్లో పాల్గొన్న ఎస్ఐజీ.నగర్ యూత్ ప్రతినిధులు

నేటి నుంచి లలితా పీఠంలో...

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కిర్లంపూడి లేఅవుట్‌లో వెలసిన శ్రీ లలితమ్మ ఆలయంలో సోమవారం నుంచి 19 తేదీ వరకు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు లలిత పీఠం ఆలయ పర్యవేక్షకులు కాందూరి లక్ష్మణస్వామి తెలిపారు. 14న పాశుపత రుద్ర యాగం, 15న శుభ్రమణ్యేశ్వరయాగం, 16న లక్ష్మీగణపతి పాశుపత హోమం, 17న పౌర్ణమి విశేష పూజ, 18న అష్టలక్ష్మీ పూజ, 19న ఊరేగింపు, పూర్ణాహుతి కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరపనున్నట్లు తెలిపారు.

తులసీదళ అర్చనలు

ఆరిలోవ, న్యూస్‌టుడే : చినగదిలి రాధాకృష్ణనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా విశేష తులసీదళ అర్చనలు జరిగాయి. వేంకటేశ్వరస్వామికి తులసీదళాలతో భక్తులు స్వయంగా అర్చన చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ద్వాదశి సోమవారం రోజున ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం నిర్వహిస్తారని ఆలయ ధర్మాచార్యులు పీవీ నరసింహాచార్యులు తెలిపారు.



ఆలయంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో దీపారాధన

ఆరిలోవ, న్యూస్‌టుడే : చినగదిలి నార్త్ శిరిడీ సాయిబాబా దేవాలయంలో విజయదశమి పర్వదినం సందర్భంగా దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో మొత్తం 18 వేల ప్రమిదులు అమర్చి దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమనారాయణ మొదటి దీపాన్ని వెలిగించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ వానపల్లి అప్పారావు, కార్యదర్శి ఆర్.ఎ.పాత్రో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దీపం వెలిగిస్తున్న ఆర్.సోమనారాయణ



దేదీప్యమానంగా ఆలయ ప్రాంగణం

వేలం ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మద్యం వేలం ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సిరిపురం బాలల ప్రాంగణాన్ని సందర్శించారు. మద్యం వేలం ప్రక్రియలో దరఖాస్తులు అధికంగా రావడంతో ఆశావహులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటర్లు అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. వేలం ప్రక్రియ సజావుగా, సక్రమంగా ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.



వేలం నిర్వహించే ప్రాంగణం పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కూలిన రక్షణగోడ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: హనుమంతువాక కొండవాలులో విజయదుర్గమ్మ ఆలయానికి ఆనుకుని ఉన్న రక్షణ గోడ శనివారం కూలిపోయింది. ఈగోడ ఇటీవల కురిసిన వర్షాలకు నానిపోయి ప్రమాదకర స్థితికి చేరి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఆ సమయంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. స్థానిక యువకులు మిగిలిన గోడను కూడా తొలగించి మరోసారి ప్రమాదం జరగకుండా పర్యవేక్షించారు.



రోడ్డుమీద పడిపోయిన గోడ

ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం



మహా విశాఖ నగరపాలక సంస్థలో ఆధునికీకరించిన ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం

కార్పొరేషన్, న్యూస్‌టుడే

మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం అమలులోకి తెచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తండోపతండాలుగా ప్రజలు తరలి వచ్చిన ఫిర్యాదులు అందజేయడాన్ని కమిషనర్ సంపత్‌కుమార్ చూశారు. దీంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శాశ్వత ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవారు తమ పేరు, ఆధార్, సమస్యను సోమవారం నుంచి శనివారం వరకు పని దినాలలో అందించేలా చర్యలు తీసుకున్నారు. దీని కోసం జీవీఎంసీలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ కేంద్రంలో ఎలాంటి ఫిర్యాదులు స్వీకరిస్తారో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయించారు. అయినా సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల రాక తగ్గడం లేదు. దీంతో ప్రత్యేకంగా ఐదుగురు సిబ్బందిని నియమించి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. నేరుగా కమిషనర్ లేదా మేయరును కలిసి ఫిర్యాదు చేయాలనే ఉద్దేశం ఫిర్యాదీదారుల్లో కనిపిస్తోంది.

స్వల్ప మార్పులతో ఆదరణ

గత కమిషనర్లు అవలంబించిన విధానాలను తర్వాత వచ్చిన కమిషనర్లు పట్టించుకోవడంలేదు. గతంలో జీవీఎంసీలో ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రికార్డింగ్ సిస్టం) అమలు చేసేవారు. ఈ విధానంలో నగర ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేసేవారు. కమిషనర్లు ఉదయం పూట క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సి ఉంటుంది. దీంతో నేరుగా ఐవీఆర్ఎస్ కేంద్రానికి వెళ్లి అక్కడికి వచ్చిన సమస్యలపై ఫిర్యాదీదారులతో మాట్లాడేవారు. తర్వాత క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రానికి వచ్చినవారితో కమిషనర్ లేదా మేయరు ఇతర అధికారులెవరైనా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యను తీసుకుని పరిష్కరిస్తే ఈ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలుగుతుంది.

పండగలొస్తే పారిశుద్ధ్యం పట్టుతప్పినట్లే..

శివాజీపాలెం (మద్దిలపాలెం),పెదవాల్తేరు, న్యూస్‌టుడే

పండగలొస్తే పారిశుద్ధ్యం పట్టుతప్పుతోంది. పండగల సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది సెలవులు పెడుతుండటంతో వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దసరా కావడంతో రెండ్రోజులుగా సిబ్బంది లేమి కారణంగా వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయి ఉన్నాయి. 22వ వార్డులో శివాజీపాలెం, పిఠాపురంకాలనీ, మద్దిలపాలెం, పీతలవానిపాలెం, పెదజాలారిపేట చేపల బజారు ప్రాంతాల్లో రోడ్ల మీద చెత్త దర్శనమిస్తోంది.



పిఠాపురంకాలనీ మార్కెట్ వద్ద పారిశుద్ధ్య పరిస్థితి



జాలారిపేటలో నిండిపోయిన చెత్త డబ్బాలు

ప్రవీణామృతం చిత్రం షూటింగ్ ప్రారంభం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సంప్రదాయ సంగీత విశిష్టతను చాటి చెప్పేలా ప్రవీణామృతం చిత్ర షూటింగ్ ఆదివారం ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీ సెక్టారు-11లో జరిగిన కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు జ్యోతి వెలిగించి చిత్రీకరణ ప్రారంభించారు. చిత్ర యూనిట్‌ను అభినందించారు. దర్శకుడు శివశ్రీ, డాక్టర్ బి.ఎం.నాయుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

17న ఆలయ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తి ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 17వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాబాయి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు వితరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల ముగింపు వేడుకల సందర్భంగా అక్కయ్యపాలెం పాత పోస్టాఫీసు వీధిలోని మాస్టర్ ఇ.కె. ఉచిత హోమియో వైద్యాలయంలో ఆదివారం డాక్టర్ కె.ఎస్.శాస్త్రి పర్యవేక్షణలో పేదలకు దుస్తులు, అన్న సమారాధన నిర్వహించారు. ★ జీవీఎంసీ 27వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సొంత నిధులతో పారిశుద్ధ్య సిబ్బందికి స్టీలు బిందెలు అందజేశారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

కులపతి ఐ.వి.ఎల్. శాస్త్రి పేరిట పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

గురుద్వారా, న్యూస్‌టుడే : సంగీత జనకులం వ్యవస్థాపకుడైన కులపతి ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన రూ.5 స్టాంప్‌ను ఆదాయ పన్నుల శాఖ అధికారి వి.నాగసూర్యరావు ఆవిష్కరించారు. ఆదివారం సీతమ్మధారలో సంగీత జనకులం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం ద్వారా 20వేల మందికి ఉచితంగా సంగీతం నేర్పించారన్నారు. అనంతరం పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించారు. సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాళీప్రసాద్, కులపతి ట్రస్ట్ బుక్స్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్, బి.విజయప్రసాద్, సి.హెచ్.గిరిధర్, ఐ.రమణిప్రసాద్, ఎస్.లక్ష్మీ, శైలేష్ పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న సంగీత జనకులం అసోసియేషన్ సభ్యులు

ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అమలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం అమలులోకి తెచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తండోపతండాలుగా ప్రజలు తరలి వచ్చి ఫిర్యాదులు అందజేయడాన్ని కమిషనర్ సంపత్ కుమార్ చూశారు. దీంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శాశ్వత ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవారు తమ పేరు, ఆధార్, సమస్యను సోమవారం నుంచి శనివారం వరకు పని దినాలలో అందించేలా చర్యలు తీసుకున్నారు. దీని కోసం జీవీఎంసీలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ కేంద్రంలో ఎలాంటి ఫిర్యాదులు స్వీకరిస్తారో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయించారు. అయినా సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల రాక తగ్గడం లేదు. దీంతో ప్రత్యేకంగా ఐదుగురు సిబ్బందిని నియమించి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. నేరుగా కమిషనర్ లేదా మేయరును కలిసి ఫిర్యాదు చేయాలనే ఉద్దేశ్యం ఫిర్యాదీదారుల్లో కనిపిస్తోంది.



వివరాలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

స్వల్ప మార్పులతో ఆదరణ

గత కమిషనర్లు అవలంబించిన విధానాలను తర్వాత వచ్చిన కమిషనర్లు పట్టించుకోవడం లేదు. గతంలో జీవీఎంసీలో ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రికార్డింగ్ సిస్టం) అమలు చేసేవారు. ఈ విధానంలో నగర ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేసేవారు. కమిషనర్లు ఉదయం పూట క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సి ఉంటుంది. దీంతో నేరుగా ఐవీఆర్ఎస్ కేంద్రానికి వెళ్లి అక్కడికి వచ్చిన సమస్యలపై ఫిర్యాదీదారులతో మాట్లాడేవారు. తర్వాత క్షేత్ర స్థాయికి వెళ్లి ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రానికి వచ్చిన వారితో కమిషనర్ లేదా మేయరు ఇతర అధికారులెవరైనా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యను తీసుకుని పరిష్కరిస్తే ఈ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. తద్వారా సోమవారమే కాకుండా మిగతా రోజుల్లోనూ ఫిర్యాదులు ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఫిర్యాదుల కేంద్రానికి వచ్చే సమస్యలపై వారానికోసారి సమీక్ష నిర్వహిస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరించిన ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం

సంప్రదాయంగా బొమ్మలకొలువు



మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ సెక్టర్-8 బాలభాను విద్యాలయం సమీపంలో వజ్రపు వరలక్ష్మి నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు చూపరులను ఆకట్టుకుంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే బొమ్మలను కొలువుదీర్చి స్థానికులను ఆహ్వానించారు. ముందుతరాలకు మన సంప్రదాయాలను అలవాటు చేసే క్రమంలో ఏటా బొమ్మల కొలువు పెడుతున్నట్లు వరలక్ష్మి తెలిపారు.

ఏయూలో ఫ్రీడమ్ రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారత ఇంధనం, శక్తి సంస్థ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఆంధ్రవిశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ఐ.వెంకటేశ్వరరావు మాణిక్యాలరావు పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రామునాయుడు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత మహోత్సవం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఐవీఎల్‌శాస్త్రి సంగీత సమితి వ్యవస్థాపకుడు ఆకొండి వెంకటరావు ఆధ్వర్యంలో సమితి విద్యార్థులు నిర్విరామంగా 12 గంటలపాటు మృదు మధురంగా సంకీర్తనలు ఆలపించారు. త్యాగరాజస్వామి కీర్తనలు, భజనలతో కూడాప్రాంగణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. కార్యక్రమంలో డాక్టర్ జి.రమేశరావు, శాంతి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కె.సుబ్రహ్మణ్యం, జి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న ఐవీఎల్‌శాస్త్రి సంగీత సమితి సభ్యులు

17న సాయిబాబా మందిరంలో మహా అన్నదానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బురుజుపేటలోని శిర్డీ సాయిబాబా మందిరం 30వ వార్షికోత్సవం, సద్గురు సాయినాథ్ మహరాజ్ 106వ పుణ్యతిథి (మహాసమాధి) ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఈనెల 17న మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కందర్ప నాగేశ్వరరావు తెలిపారు. విజయదశమి నాడు మధ్యాహ్నం బాబాకు నక్షత్ర హారతి ఇచ్చినట్లు పేర్కొన్నారు.



అలంకరణలో సాయిబాబా విగ్రహం

శిర్డీ సాయి మహాసమాధి పూజలు



మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక శిర్డీసాయి ధ్యాన మందిరంలో శనివారం శ్రీసాయి మహాసమాధి పూజలను నిర్వహించారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు అయిలూరి రామశాస్త్రి శాస్త్రోక్తంగా సమాధి సేవ జరిపారు.

చెడుపై మంచి గెలుపే విజయదశమి



పూర్ణామార్కెట్‌లోని దుర్గాదేవి విగ్రహం వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నాయకులు



స్వామి వివేకానంద సేవా సంస్థలో ..



స్టేషన్‌రోడ్డు కాళీమాత ఆలయంలో..



రాజరాజేశ్వరి అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు



రాజరాజేశ్వరిగా ఉమాదేవి

పూర్ణామార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: చెడుపై మంచి గెలుపు సాధించడమే విజయ దశమి పర్వదిన ఉద్దేశమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 35వ వార్డు తెదేపా అధ్యక్షుడు బొచ్చ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని ఆదివారం ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

వన్‌టౌన్: పాతనగరం కృష్ణా థియేటర్ సమీపంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో దుర్గాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. సంస్థ ట్రస్టీ విద్యార్థులు కీర్తనలు ఆలపించడంతోపాటు కోలాటాలు ప్రదర్శించారు. నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు. ద్రోణంరాజు శ్రీవత్స, సూరాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: వెలంపేట దుర్గాలమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. విజయదశమిని పురస్కరించుకుని శనివారం ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్టేషన్ రోడ్డులోని కాళీమాత ఆలయంలో బెంగాలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు.

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు రాజరాజేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి, శ్రీవారి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. అమ్మవారిని స్వయంవర పార్వతీదేవిగా, బాబాను అర్ధనారీశ్వరిగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మాధవధార, న్యూస్‌టుడే : జీవీఎంసీ 51వ వార్డు సీతన్నగార్డెన్స్‌లో వెలసిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త సనపల కీర్తి పర్యవేక్షించారు.



దుర్గమాంబ ఆలయం వద్ద దీపాలంకరణ



రాజరాజేశ్వరిగా లలితాదేవి

కనకమహాలక్ష్మి సేవలో ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దసరా పర్వదినమైన శనివారం నాడు పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ, అనకాపల్లి జేసీ జాహ్నవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో కె.శోభారాణి, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, ఈతు సి.హెచ్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం, న్యూస్‌టుడే: రెడ్డికంచరపాలెం సన్యాసి కల్లబ్ వద్దనున్న అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో దీపాలంకరణ చేశారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక సీతారామాలయంలో కొలువైన లలితాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. మహంకాళి ప్రసన్న దేవి దుర్గామాత సన్నిధిలో నేత్రపర్వంగా దీపాలంకరణ చేశారు.



మహంకాళి ప్రసన్న దేవి సన్నిధిలో దీపారాధన



అర్ధనారీశ్వరి అవతారంలో బాబా



స్వయంవరం పార్వతీదేవిగా అమ్మవారు

వైభవుడి ఆలయానికి పోటెత్తిన జనం

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పరాడలోని వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రంలో విజయదశమి సందర్భంగా స్వామివారు వజ్రకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. మహాలక్ష్మి విగ్రహదాత మధుమోహనరావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నాగరాజు దంపతులు పద్మావతి అమ్మవారికి అందజేసిన స్వర్ణపూత కలిగిన రాగి ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్, ప్రధాన అర్చకులు శేష, వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వేంకటేశ్వరుడి ఆలయంలో భక్తుల కోలాహలం



సీతన్నగార్డెన్స్‌లో శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో ..



పూజలందుకున్న దుర్గమాంబ అమ్మవారు

బాక్సింగ్ క్లబ్‌లో దసరా సంబరాలు

గురుద్వారా, న్యూస్‌టుడే : మైక్‌బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో టీపీటీకాలనీ దరి ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలలో గల క్లబ్‌లో శనివారం దసరా సంబరాలు నిర్వహించారు. క్రీడా భారతి అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్కూల్ గేమ్స్.. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రానికి బంగారు పతకాలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ శిక్షకుడు దినేశ్, భవిష్యత్తు, చిత్తరంజన్, క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో వెంకటేశ్వరరావు

రైల్వేలో స్వచ్ఛతకు కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : రైళ్ల వినియోగదారులకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి మేము కృషిచేస్తామని డి.ఆర్.ఎం. సౌరభ్‌ప్రసాద్ అన్నారు. వాల్తేరు డివిజన్‌లో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. వాల్తేరు డివిజన్ పర్యావరణ విభాగం, ఎన్.జి.ఒ.లు సంయుక్తంగా 'స్వచ్ఛపరివార్ - స్వచ్ఛ సంవాద్' పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని డివిజన్‌లో పలు ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు.



శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

డిసెంబరులో భీమిలి ఉత్సవ్: గంటా

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి మూడ్రోజుల పాటు భీమిలి ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీల ముగింపోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోలాటం, తదితర సాంస్కృతిక పోటీలను ఇక నుంచి ఏటా నిర్వహించనున్నామన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి పోటీల స్ఫూర్తితో గాజువాకలోనూ ఈ తరహా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ విభాగంలో చిప్పాడ, గెద్దపేట, ముచ్చెర్ల, జూనియర్ విభాగంలో పాండ్రంగి, యాతకుమ్మరిపాలెం, చందక జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు అతిథులు నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఛైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, ఆర్డీవో సంగీత్ మాధుర్, ఎంపీడీవో కనకల రమేశ్ నాయుడు, భాజపా, జనసేన ఇన్‌ఛార్జులు కంటుభుక్త రామానాయుడు, పంచకర్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.



చిప్పాడ జట్టుకు విజేత ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

వంతెనలకు ఊతం..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే విశాఖ రైలు నిలయంలో పాదచారుల వంతెనలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఐదు నెలల కిందట గేట్-3లో ఉన్న వంతెన 3,4 ప్లాట్‌ఫామ్‌ల మధ్య కుంగిపోయింది. ఎట్టకేలకు స్టేషన్ అధికారులు ఇటీవల దానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే మిగిలిన వంతెనలపై దృష్టి సారించకపోవడంతో వాటి పరిస్థితి సైతం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో వంతెనలకు దన్నుగా ప్రతి రెండు పట్టాల మధ్య స్తంభాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. స్టేషన్ పునఃనిర్మాణ పనులు నిలిచిపోవడంతో మరి కొన్నేళ్లు ఈ వంతెనలతోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొనడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.



గేట్-1 వంతెనకు దన్నుగా ఏర్పాటు చేస్తున్న స్తంభాలు



మరమ్మతుల అనంతరం అందుబాటులోకి వచ్చిన వంతెన

ఘనంగా ముగింపోత్సవం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిని పరిరక్షించేందుకు సనాతన సంప్రదాయాన్ని పాటించాలని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి అన్నారు. అక్కయ్యపాలెం మాస్టర్ హోమియో కేంద్రంలో ఆదివారం ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన దుర్గా పూజల ముగింపోత్సవంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు వివిధ వస్తువులు బహూకరించారు. అనంతరం కె.ఎస్.శాస్త్రిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సత్యమూర్తి, సి.హెచ్.నరసింహమూర్తి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కె.ఎస్. శాస్త్రిని సత్కరిస్తున్న చింతలపాటి సత్యదేవ్ తదితరులు

వేలం ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మద్యం వేలం ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సిరిపురం బాలల ప్రాంగణాన్ని సందర్శించారు. మద్యం వేలం ప్రక్రియలో దరఖాస్తులు అధికంగా రావడంతో ఆశావహులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటర్లు అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. వేలం ప్రక్రియ సజావుగా, సక్రమంగా ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.



వేలం నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్ల పరిశీలన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాలను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సందర్శించారు. పెదజాలారిపేట, సాగర్‌నగర్, భీమిలి బీచ్, పెందుర్తి, అప్పికొండ తదితర ప్రాంతాలను ఆయన సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సిబ్బందితో పాటు సరిపడినంత గత ఈతగాళ్లు ఉన్నదీ లేనిది పరిశీలించారు. సముద్రంలోకి నేరుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. విగ్రహాలు తీసుకువచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం



శిర్డీసాయి మహా సమాధి పూజోత్సవం

షిప్‌యార్డుకాలనీ (మల్కాపురం) న్యూస్‌టుడే: గాంధీగ్రాం హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో ఉన్న శిర్డీసాయినాథుని మందిరంలో ఆదివారం బాబా వారి 106వ మహాసమాధి పూజోత్సవాన్ని బాబా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆర్‌వీఆర్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తొలుత శిర్డీసాయిబాబాకి పంచామృతాభిషేకాలు, షిప్‌యార్డుకాలనీలో పల్లకీలో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కులపతి ఐ.వి.ఎల్. శాస్త్రి పేరిట పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

గురుద్వారా, న్యూస్‌టుడే : సంగీత జనకులం వ్యవస్థాపకుడైన కులపతి ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన రూ.5 స్టాంప్‌ను ఆదాయ పన్నుల శాఖ అధికారి వి.నాగసూర్యరావు ఆవిష్కరించారు. ఆదివారం సీతమ్మధారలో సంగీత జనకులం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం ద్వారా 20వేల మందికి ఉచితంగా సంగీతం నేర్పించారన్నారు. అనంతరం పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించారు. సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాళీప్రసాద్, కులపతి ట్రస్ట్ బుక్స్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్, బి.విజయప్రసాద్, సి.హెచ్.గిరిధర్, ఐ.రమణిప్రసాద్, ఎస్.లక్ష్మీ, శైలేష్ పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే

సమస్య: పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ఎక్కడ చూసినా వీధి దీపాలు వెలగడం లేదు. నడుపూరు, శీరంవానిపాలెంలో ఎల్ఈడీ దీపాలు పడకేశాయి. **- సన్యాసిరావు, నడుపూరు**

సమాధానం: సిబ్బందిని పంపి పునరుద్ధరిస్తాం. **- శివ, వీధి నిర్వహకుడు**

సమస్య: హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీ బ్లాకుల్లో కాలువలు శుభ్రత లేక మురుగు నీరు ముందుకు పారడంలేదు.

- వంశీ, 76వవార్డు

సమాధానం: ప్రత్యేక శుభ్రత పనులు చేపడతాం. **- తాతారావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు**

ఏరులైన నిర్లక్ష్యం

గాజువాక, న్యూస్‌టుడే: నిర్లక్ష్యం ఏరులై పారింది. గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్) సుందరయ్యకాలనీ వద్ద శనివారం ఒక్కసారిగా నీరు రోడ్డెక్కడంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సిబ్బంది ఎవరూ లేక ప్రవాహానికి అడ్డుకట్ట పడలేదు. అంతా దసరా సెలవులో ఉండడంతో గంటల కొద్దీ నీరు వృథాగా పారింది. మొలలోతు నీటిలోంచే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కేబీఆర్ పంపు హౌస్ వెనకనున్న దిబ్బపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లోని యూజీడీ లైను ఓవర్ ఫ్లో వల్ల ఇలా జరిగిందంటూ జీవీఎంసీ సిబ్బంది చెబుతున్నారు. పంపుహౌస్‌లోంచి వరద నీరు పోటెత్తిందని, తరచూ ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులెవరూ ఇటు చూడడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ శివారులో పలుచోట్ల చుక్క నీటికి కటకటలాడుతున్న పరిస్థితి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడ చూసినా భూగర్భ పైపులైన్లు పగిలి నీరు నేలపాలవుతోందని, తగిన పర్యవేక్షణ ఉండేలా చూడాలని వీరంతా కోరుతున్నారు.



కేబీఆర్ పంపు హౌస్ వద్ద వృథాగా పోతున్న నీరు

ఫోకస్

కదలని వ్యర్థాలు..!

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. జీవీఎంసీ సిబ్బంది పండగ సెలవుల పుణ్యమాని చెత్త మూటలు కదల్లేదు. శుక్రవారం నుంచి జీవీఎంసీ ప్రజా ఆరోగ్య సిబ్బందికి సెలవులు వచ్చాయి. గాజువాక జోన్‌లో 20 వార్డుల నుంచి రోజుకు 350 టన్నుల చెత్త పోగవుతోంది. ఏ రోజు వ్యర్థాలు ఆరోజే తీయాల్సి ఉన్నా వీటిని తరలించేవారులేక దుర్గంధం మధ్య నివాసితులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా ఆదివారం కణితిరోడ్డు, బీసీ రోడ్డు, గాజువాక ప్రధాన రహదారి, పెదగంట్యాడ, గాజువాక, వడ్లపూడి ఉక్కు నిర్వాసితకాలనీల్లో చెత్త కొండల్లా పేరుకుపోయింది. పరిస్థితి విషమించకముందే పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సమస్యలపై వినతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకి ఆ శాఖ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. షీలానగర్‌లో ఆదివారం పల్లాను కలిసిన సిబ్బంది తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖలో 2002 డీఎస్సీ ద్వారా నియమించిన కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీహెచ్ఏలకు ఆర్పీఎస్ 2022 ప్రకారం వంద శాతం గ్రాస్ వేతనం (పే, డీఏ, హెచ్ఆర్ఏ) వర్తింపజేసే చట్టాన్ని అమలు చేయాలని విన్నవించారు. సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వీరు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది సాయికిరణ్, శ్యామ్, వేణుబాబు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి, దువ్వాడ పరిసర గ్రామాలను కలిపి ప్రత్యేక రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలని స్థానిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఆదివారం అగనంపూడి వచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే రహదారిని విద్యుద్దీకరించాలని, ఉక్కు పునరావాస కాలనీల పరిధిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఇండోర్ ఉపకేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, వి.రాజు, చందూరమేష్ తదితరులు పాల్గొన్నారు.



తెదేపా ఏపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సంక్షిప్త సమాచారం..

క్రైం ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం నేరవిభాగం ఎస్సైగా జి.తేజేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్థులు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏయూలో ఫ్రీడమ్ రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారత ఇంధనం, శక్తి సంస్థ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఆంధ్రవిశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ఐ.వెంకటేశ్వరరావు మాణిక్యాలరావు పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రామునాయుడు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు నాట్యసంస్థల కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : రైల్ల వినియోగదారులకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి మేము కృషిచేస్తామని డి.ఆర్.ఎం. సౌరభ్‌ప్రసాద్ అన్నారు. వాల్తేరు డివిజన్‌లో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. వాల్తేరు డివిజన్ పర్యావరణ విభాగం, ఎన్.జి.ఒ.లు సంయుక్తంగా స్వచ్ఛపరివార్ - స్వచ్ఛ సంవాద్ పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని డివిజన్‌లో పలు ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు.

గాజువాక సినిమాలు..

కన్య: దేవర, హెవెన్: జనక అయితే గనక
శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ, అన్నపూర్ణ: వేట్టయన్, మోహినీ 70ఎంఎం: విశ్వం
లక్ష్మీకాంత్: స్వాగ్, మినీ మోహినీ: మార్టిన్
మోహినీ: జిగ్రా,
విశేష్: మా నాన్న సూపర్ హీరో

గోపాలపట్నంలో: శ్రీనరసింహా: జనక అయితే గనక, నరసింహా: వేట్టయన్
సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర
మౌర్య: మా నాన్న.. సూపర్ హీరో

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: వేట్టయన్
స్క్రీన్-3: విశ్వం, స్క్రీన్-4: దేవర
స్క్రీన్-1: మార్టిన్

ఏకరూప దుస్తుల పంపిణీ

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: 86వ వార్డు రాజీవ్ నగర్ శ్రీగౌరీ పరమేశ్వర, రాసమాంబ ఆటో స్టాండ్ డ్రైవర్లు, ఓనర్ల అసోసియేషన్ సభ్యులకు ఆ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ఏకరూప దుస్తులు (కాకి) అందజేశారు. గత 25 ఏళ్లుగా ఏటా ఆలా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకరూప దుస్తులు ధరించి రోజూ జాగ్రత్తగా ఆటో నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమణ, నాయుడు, రమేష్, జగదీష్, స్టాండ్ ప్రెసిడెంట్ అరిగా సత్తిబాబు, పిండికోటి దేముడు బాబు, సుందరరావు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 1, 4లలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్టేషన్ అభివృద్ధి చెందుతున్నా తగినంత మంది పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో స్టేషన్ పరిధిలో చెత్తా చెదారం పేరుకుపోతుందని పేర్కొన్నారు. శానిటరీ అధికారి సైతం సుమారు ఏడాదిన్నర క్రితం ఉద్యోగ విరమణ చేయడంతో మరొకరికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం వ్యర్థాలను, పిచ్చి చెట్లను తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వరరావు, రామకృష్ణ, జాషువా, కె.వీర్రాజు, మానవ వికాస వేదిక ప్రతినిధులు ఎ.శ్రీనివాసరావు, స్పందన చేయూత ఫౌండేషన్ ఇ.బుచ్చిరాజు, సుధారాణి, మానవత సేవా సమత ప్రతినిధి వీఆర్‌కే రాజు, లైన్స్ క్లబ్ (కూర్మన్నపాలెం, స్టీల్ సిటీ, గాజువాక, అగనంపూడి) ప్రతినిధులు మురళీధర్‌రెడ్డి, పి.కనకమహాలక్ష్మి, ఎస్.కోటేశ్వరరావు, మస్తాన్‌రెడ్డి జీవీఎంసీ, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శుభ్రత చర్యలు చేపడుతున్న స్వచ్ఛంద సేవకులు

తిరుమల దివ్య క్షేత్రానికి భక్తుల విరాళాలు

అక్కిరెడ్డిపాలెం (షీలానగర్), న్యూస్‌టుడే: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రానికి ఇద్దరు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. స్వామి వారి సన్నిధిలో వేంకటేశ్వర కాలనీకి చెందిన బండారు శ్రీనివాస్, సుభాషిణి దంపతులు శ్రీవారి వెండి వరదహస్తం కోసం రూ.1.75 లక్షల చెక్కును.. శ్రీవారి అన్నదాన మూలనిధికి అదే కాలనీకి చెందిన కనకమేడల రాజేంద్రప్రసాద్, లక్ష్మి దంపతులు తమ కుమార్తె వెంకటనాగసాయి పుట్టినరోజు సందర్భంగా రూ.50 వేలు చెక్కును ఆలయ ట్రస్టు ప్రతినిధులకు అందించారు. దాతలను అర్చకులు వేద ఆశీర్వచనం చేసి సత్కరించారు.



చెక్కును అందజేస్తున్న దాతలు బండారు శ్రీనివాస్, సుభాషిణి దంపతులు

జయజయ మహిషాసుర మర్దిని..!

అంగరంగ వైభవంగా దసరా ముగింపు ఉత్సవాలు



ఎల్‌వీనగర్‌లో కనకదుర్గ అమ్మవారు



డ్రైవర్స్‌కాలనీలో..



పెదగంట్యాడ వాంబే కాలనీలో అలంకరణలో శ్రీవారు



శమీ పూజ ఊరేగింపులో భక్తులు



సమతానగర్ సాయినాథుడు



వినాయకనగర్‌లో ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు



కళారాధన చిన్నారుల నృత్య రూపకం



పెదగంట్యాడలో...



అగనంపూడి కూడలిలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దుర్గమాంబ



పెదమడకలో మాతా దుర్గాభవాని ఆలయంలో అమ్మవారు



అలంకరణలో వేంకటేశ్వరకాలనీ లలితాదేవి

గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో విజయదశమి పర్వదినం పురస్కరించుకుని శనివారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల మండపాల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు, ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ, అగనంపూడి, గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, మల్కాపురం, అక్కిరెడ్డిపాలెం, సింధియా



పద్మనాభనగర్‌లో..



నాతయ్యపాలెం బంగారుమాంబ



కొత్తపాలెంలో అన్నసమారాధన చేస్తున్న కార్పొరేటర్ వెంకటరమేశ్



63వ వార్డులో అమ్మవారి సారె ఊరేగింపులో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, అమ్మవారి కమిటీ సభ్యులు



గాజువాక డిపో వద్ద ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకి జ్ఞాపిక అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పిళ్లా శంకరరావు



అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద..



పిలకవానిపాలెంలో దుర్గాదేవి పూజలో ఎమ్మెల్యే గణబాబు

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం (షీలానగర్), న్యూస్‌టుడే: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి విశిష్ట దినం శనివారం, విజయ దశమి, శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం ఒకే రోజు కావడంతో విశిష్ట పూజలు చేపట్టారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ నిర్వహించి భక్తులు తీసుకొచ్చిన పూలతో తోమాల సేవ చేపట్టి బాలాజీని సుందరంగా పూలతో అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించి శాంతి కల్యాణం చేపట్టారు. గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



ఉత్సవమూర్తులు



తోమాల సేవకు పూలతో భక్తులు



వేలం నిర్వహించే ప్రాంగణం పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వేలం ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మద్యం వేలం ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సిరిపురం బాలల ప్రాంగణాన్ని సందర్శించారు. మద్యం వేలం ప్రక్రియలో దరఖాస్తులు అధికంగా రావడంతో ఆశావహులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటర్లు అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. వేలం ప్రక్రియ సజావుగా, సక్రమంగా ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

నిమజ్జన ప్రాంతాల్లో సీపీ సందర్శన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జన ప్రాంతాలను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సందర్శించారు. పెదజాలారిపేట, సాగర్‌నగర్, భీమిలి బీచ్, పెందుర్తి, అప్పికొండ తదితర ప్రాంతాలను ఆయన సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సిబ్బందితో పాటు సరిపడినంత గత ఈతగాళ్లు ఉన్నదీ లేనిది పరిశీలించారు. సముద్రంలోకి నేరుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. విగ్రహాలు తీసుకువచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ